
జిల్లా ప్రత్యేకాధికారిగా కోన శశిధర్

● జిల్లాస్థాయి అధికారుల నియామకం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేకాధికారిగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పలుశాఖలకు జిల్లాస్థాయి అధికారులను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. సాంఘీక సంక్షేమ శాఖ డీడీగా శోభారాణి నియమితులయ్యారు. ఈమె పశ్చిమ గోదావరి జిల్లా సాంఘీక సంక్షేమాధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆ శాఖ డీడీగా శ్రీనివాసులు

- మిగతా 6లో



'పెరంకొండ' కదిలింది!

- ఫైలును విజిలెన్స్‌కు అప్పగించిన కూటమి ప్రభుత్వం
- అక్రమాలపై క్షేత్రస్థాయిలో మొదలైన విచారణ
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో నాడు జేసీ ఎంక్వయిరీ

సుమారు రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దోచి పెట్టిన కుంభకోణమిది. అధికారులు, దళారులు కుమ్మక్కై దోపిడీకి వేసిన భారీ స్కెచ్ ఈ వ్యవహారం. కండలేరు ముంపు కింద లేకపోయినా ఉన్నట్లుగా చూపించి రూ.కోట్ల ప్రజల సొమ్మును దిగమింగిన వైనమిది. 'ఆంధ్రజ్యోతి' కథనాలతో గత ప్రభుత్వంలో అప్పటి జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి అక్రమాలు నిజమని తేల్చారు. అయినా నాడు భోక్తలు డబ్బులతో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి ఈ విచారణ ఫైల్ బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ అవినీతి వ్యవహారంపై దృష్టి పెట్టింది. ముంపు అక్రమాలు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో వీటికి చెక్ పెట్టేందుకు పెరంకొండ వ్యవహారాన్ని విజిలెన్స్ విభాగానికి అప్పగించింది. పెరంకొండలో విజిలెన్స్ అధికారులు విచారిస్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

- వివరాలు 6లో

రోజంతా చినుకులే!

● రాపూరులో భారీ వర్షం ● నేడు కూడా జిల్లాకు వర్ష సూచన

నెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి జిల్లాను చిత్తడి చిత్తడి చేస్తోంది. భారీ వర్షపాతం నమోదు కాకపోయి నా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురవడంతో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. ఆకాశం మేఘావృతం కావడంతో సాయంత్రం ఐదు గంటలకే చీకటి పడింది. రాపూరు, పొదలకూరు, సైదాపురం, సీతారామపురంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. రాపూరులో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. రాపూరులో అత్యధికంగా 97.8 మి.మీ, ఆ తర్వాత సైదాపురంలో 37.4, పొదలకూరులో 13, సీతారామపురంలో 19.2, నెల్లూరు అర్బన్‌లో 7.8, రూరల్‌లో 5.6 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠంగా 1.8 నుంచి గరిష్ఠంగా 8 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలోని 19 మండలాల్లో వర్షం కురవలేదు. అల్పపీడన ప్రభావంతో శుక్ర వారం కూడా జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు అధికారులు తెలిపారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి) : రోజంతా వర్షం కురవడంతో రోడ్లపై నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇక పెంచలకోన క్షేత్రంలో భారీ వర్షం కురవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కోన పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారింది. ఎత్తయిన కొండల్లో నుంచి తెల్లని పాలధారలా నుర గలు కక్కుతూ కిందకు జాలు వారుతున్న జలపాత దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

● అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : చల్లని వాతావరణం, సన్నని చినుకులు.. పచ్చని కొండలపై అలుముకొన్న మంచు తెర... జలజల పారే పెన్నమ్మ అందాలతో సోమశిల జలాశయం పర్యాటకులను మంత్రముగ్ధులను చేసింది. ఊటీని తలపిస్తున్న ఈ దృశ్యాలను పర్యావరణ ప్రియులు తమ కెమెరాల్లో బంధించారు. కాగా, సోమశిల జలాశయానికి 2,903 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, 72.468 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువ 150 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సైదాపురం (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి కైవల్యానది పొంగి ప్రవహించింది. స్థానిక ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలోఇక నీరు చేరడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.





అనంతసాగరం : పచ్చని అందాల వెనుక మంచు తెర మధ్య కొండలు



రాపూరు : పెంచలకోనలోని కొండలను కమ్మేసిన పొగమంచు, దుముకుతున్న జలపాతం



నెల్లూరు: గాంధీబొమ్మ కూడలిలో నీరు



సైదాపురం :కైవల్యా నదిలో నీటి ఉధృతి




సైదాపురం: ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలోకి చేరిన నీరు

నిధుల్లేవు.. ఎన్నికలు ఎలా!?

- రేపు సాగునీటి సంఘాలకు తుదిపోరు
- పైసా విదల్చని ప్రభుత్వం
- ఇరిగేషన్‌లోనూ డబ్బుల్లేవు
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ జలవనరుల శాఖ అధికారులకు సమస్యగా మారింది. ఇప్పటికే నోటిఫికేషన్ ప్రకటించగా శనివారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే, ప్రభుత్వం నుంచి పైసా కూడా విడుదల కాలేదు. పైగా జలవనరుల శాఖలోనూ చిల్లిగవ్వలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ ఎలా అన్నది అర్థంకాక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో 765 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. రెవెన్యూ, జల వనరుల శాఖ భాగస్వామ్యంతో ఈ ఎన్నికలు నిర్వహించాలి. కాకపోతే సాగునీటి సంఘాలు, వాటి పరిధిలోని ఆస్తులన్నీ జలవనరుల శాఖకు చెందినవే కావడంతో ఎన్నికల ప్రక్రియ వరకే రెవెన్యూ శాఖ భాగస్వామ్యం ఉంటుంది. మిగిలిన ప్రక్రియ జలవనరుల శాఖ అధికారులు చూసుకోవాలి. నిధులు అందుబాటులో లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో ఆ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు.



● నిధులపై స్పష్టత కరువు

ఒక్కో సాగునీటి సంఘాన్ని ఒక పోలింగ్ కేంద్రంగా పరిగణిస్తారు. అందులో ఎలక్షన్ అధికారి, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి, పోలింగ్ అధికారులు ఇద్దరు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు ఇద్దరితో కలిపి ఆరుగురు సిబ్బందిని నియమిస్తారు. అలా జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం వందలాది మంది ఉద్యోగుల సేవలు అవసరం. ఇక ఎన్నికల నిర్వహణలో భాగంగా నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ, అవసరమైతే పోలింగ్ కోసం ఒక్కో సంఘానికి ఒకచోట కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ సామగ్రి, షామియానా, కుర్చీలు, ఉద్యోగులను కేంద్రాలకు తరలించడం, వారికి టిఫిన్లు, భోజనాలు, కాఫీలు వంటి ఖర్చులకు లక్షలాది రూపాయలు అవసరమవుతుంది. పోలింగ్ నిర్వహణకు అటు సిబ్బందికి, ఇటు ఓటర్లకు ఏర్పాట్లు చేయాలి. అయితే, ప్రభుత్వం ఇంతవరకు నిధులు ఇవ్వకపోగా, ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడంతో జలవనరుల శాఖ అధికారులు అయోమయంలో పడ్డారు. కొంతమంది అధికారులు తమ జేబుల నుంచి తీసి ఖర్చు చేస్తుండగా, మరికొందరు అప్పులు చేసి ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నారు.



కాలువలోకి నీటి విడుదలపై చర్చిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

మెయింటెనెన్స్ లేకనే!

● 'రాళ్లపాడు' గేటు విరిగింది! ● అభిప్రాయపడ్డ స్కూబా డైవర్లు
● గేటు తొలగింపునకు నేడు మరోమారు ప్రయత్నం

లింగసముద్రం, డిసెంబరు 12 : రాళ్లపాడు ప్రాజెక్టు గేట్ల నిర్వహణ సరిగా లేనందునే కుడికాలువ గేటు విరిగిందని విశాఖ నుంచి వచ్చిన స్కూబా డైవర్లు అభిప్రాయపడ్డారు. గురువారం నలుగురు స్కూబా డైవర్లు తూములోనికి దిగి గేటును పరిశీలించారు. గేటుకు, రాడ్‌కు మధ్య ఉన్న బోల్టు విరిగి పోవడంతో గేటు పైకి లేవడం లేదన్నారు. అంతేగాక గేటుకు, తూముకు మధ్య ఖాళీ లేదందున గేటును పగలగొట్టడం సాధ్యం కాదన్నారు. నదివైపు వెళ్లి గేటును పగలగొటాలన్నా నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. గేటు లేపేందుకు అవసరమైన ప్లేట్లు లేకపోవడంతో సాయంత్రం పనులు నిలిపి వేశారు. శుక్రవారం గేటును తొలగించేందుకు విశ్వప్రయత్నం చేస్తామని అన్నారు. కాగా, కుడి కాలువ గేటు పనులను మధ్యాహ్నం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ తిరుమణి

- మిగతా 6లో

'పొదుపు' మంత్రం.. కాజేసిన వైనం!

- కష్టజీవుల కడుపు కొట్టిన పొదుపు సంస్థ
- గడువు ముగిసినా చెల్లించని నగదు
- రెండు జిల్లాల్లో సుమారు రూ.కోటి టోకరా
- న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన మహిళలు

ఉలవపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అమాయక గిరిజన మహిళలే లక్ష్యంగా ఓ పొదుపు సంస్థ రూ.లక్షలు వసూలు చేసి నగదు చెల్లింపుల్లో చేతులెత్తేసింది. రోజులు గడుస్తున్నా నగదు చేతికి అందకపోవడంతో బాధిత మహిళలు న్యాయం కోసం గురువారం ఉలవపాడు పోలీసులను ఆశ్రయించారు. ఉలవపాడు మండలంతోపాటు చుట్టు పక్కల మండలాల బాధిత మహిళలు సుమారు 200 మంది ఉదయం నుంచి స్టేషన్ వద్దే మకాం వేశారు. బాధితుల కథనం మేరకు.. ఉలవపాడులో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కామంచి కోటి 2016 నందిని పొదుపు సంస్థను ప్రారంభిం చారు. గ్రామాల్లో ఎస్టీ సామా జిక వర్గానికి చెందిన మహి ళలకు పొదుపుపై అవగాహన కల్పించి, వారానికి రూ.50 నుంచి 200 వరకు స్తోమతను బట్టి కట్టించేవారు. ఇలా దాదాపు రూ.1 కోటి వరకు వసూలు చేసినట్టు సమాచారం. పొదుపు వారాలు కట్టడం పూర్తయ్యాక ఆ సభ్యులకు కట్టిన నగదుతోపాటు అదనంగా మరో రూ.1000 కలిపి చెల్లిస్తారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ఎస్టీ కాలనీల్లో సుమారు 1000 మంది మహిళలు నందిని పొదుపు సంస్థలో సభ్యులుగా ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. అల్లూరు, జలదంకి, కావలి, గౌరవరం (కొండాపురం మండలం), గుడ్లూరు మండలం, కందుకూరు మండలం, చీమకుర్తి, చినగంజాం, కొత్తపట్నం, మన్నూరు గ్రామాల ఎస్టీ మహిళలు సభ్యులుగా ఉన్నారు. అయితే, నాలుగేళ్ల క్రితం నందిని పొదుపు సంస్థ బాధ్యుడు కోటి కేన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఆయన భార్య నందిని పొదుపు సంస్థ నిర్వాహణ బాధ్యతలు చేపట్టింది. పొదుపు సొమ్ము వారం వారం వసూళ్లు చేసేందుకు కొంతమంది సిబ్బందిని నియమించుకుంది. డబ్బులు కట్టడం పూర్తయ్యాక సభ్యులకు అడపాదడపా మొత్తం నగదు చెల్లిస్తూ కొత్త సభ్యులను చేర్చుకుంటూ వచ్చారు. అయితే, ఆరేడు నెలల నుంచి పొదుపు డబ్బులు కట్టించుకోవడం తప్ప మెచ్యూరిటీ అయిన సభ్యుల పొదుపు నగదు చెల్లిలేదు. దీంతో సభ్యులు ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చారు.



ఉలవపాడు స్టేషన్ వద్ద పొదుపు బాధిత మహిళలు



పొట్లూరి బుబ్బమ్మ

కాయాకష్టం చేసి రూపాయి రూపాయి కూడపెట్టుకొని పొదుపు రూ.25 వేలు కట్టాను. అదేవిధంగా మా ఎస్టీ కాలనీలో కూడా 50 మంది వరకు మహిళలు పొదుపు కట్టాము. మా కష్టార్జితం సొమ్మును తిరిగి చెల్లించేలా న్యాయం చేస్తారని పోలీస్ స్టేషన్‌కు వచ్చాము.

- పొదుపు బాధిత మహిళ

● సింగరాయకొండలో కేసు

ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదయ్యింది. నందినిని స్టేషన్‌ను పిలిపించి, సొంత పూచీకత్తుపై వదిలారు. అయితే, తన స్వగ్రామం ఉలవపాడుకు చేరుకున్న నందిని తన పిల్లలతో సహా అదృశ్యమైనట్లు బాధితులు చెబుతున్నారు. గుడ్లూరు, కందుకూరు, ఉలవపాడు మండలాలకు చెందిన సుమారు 200 మంది మహిళలు గురువారం ఉలవపాడు స్టేషన్‌కు చేరుకుని, ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి పొదుపు ఆధారాలు, వివరాలను ఎస్సై అంకమ్మ సేకరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని వారికి సర్ది చెప్పారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లే అవుట్లు!

- నిబంధనలకు నీళ్లొదిలిన రియల్టర్లు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



జాతీయ రహదారిని ఆనుకొని వేసిన లే అవుట్

వరికుంటపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మారుమూల మండలాలైన వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి తదితర ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు మండలమైన వరికుంటపాడులో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఇప్పటికే మండలం మీదుగా 565 జాతీయ రహదారి ఉండగా, నూతనంగా 167బీ జాతీయ రహదారి మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విరువూరు, వేంపాడు, రామాపురం, వరికుంటపాడు, భోగ్యంవారిపల్లి, తిమ్మారెడ్డిపల్లి పంచాయతీల్లో రోజుకో చోట అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. నిబంధనలకు నీళ్లొదిలి, కనీస సౌకర్యాలకు కూడా నోచుకోని లే అవుట్లపై అధికారులు కునుకు వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● ఆక్రమణలో ప్రభుత్వ భూములు

ఇదంతా ఒకవంతైతే విరువూరు, వేంపాడు పంచాయతీల పరిధిలో వెలుస్తున్న లేఅవుట్ల పుణ్యమా అని సమీపంలోని ప్రభుత్వ భూములూ ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని ఆక్రమించిన వ్యాపారులు లేఅవుట్లుగా ముస్తాబు చేసి అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. అలాగే సీజేఎఫ్ఎస్ భూముల్లోనూ కొంత మంది లేఅవుట్లు వేసి జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన ఓ వ్యాపారి విరువూరులోని జాతీయ రహదారి సమీపంలో భారీ స్థాయిలో లేఅవుట్లు వేసేందుకు భూమిని చదునుచేసే పనులకు శ్రీకారం చుట్టాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న రియల్ దందాకు అడ్డుకట్ట వేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కానొస్తే నాకేంటి!



రామలింగాపురం జంక్షన్‌లో వర్షంలోనూ ద్విచక్రవాహనంపై దూసుకుపోతున్న వాహనదారుడు

నెల్లూరు నగరంలో కొందరు ద్విచక్ర వాహనదారులు జోరు వానలోనూ తడవకుండా రైయ్ మంటూ దూసుకుపోతున్నారు. కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రోజువారి పనులకు ఇబ్బందులు కలుగకుండా బైక్‌ల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన గొడుగులు ఏర్పాటు చేసుకొంటున్నారు. వీటిని ఎక్కువగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు. వీటి ధర కంపెనీలను బట్టి రూ.3 వేలు నుంచి రూ.20 వేలకు పైగా ఉన్నాయి. వీటిని ఏర్పాటు చేసుకున్న వాహనదారులు వర్షానికి తడవకుండా సేఫ్‌గా గమ్యస్థానాలకు వెళుతున్నారు.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

నేడు హనుమద్వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని హను మాన్ మందిరాలు, రామాలయాల్లో శుక్రవారం హనుమద్వ్రతం చేయను న్నారు. ఇందులో భాగంగా నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో ఉదయం అభిషేకం, హనుమద్ హోమం, లక్ష నాగవల్లీదళ అర్చన, పూర్ణాహుతి, ప్రసాద వితరణలు జరుగుతాయి. సాయంత్రం 4గంటలకు శ్రీరామ స్తూపంలో రామ నామ గ్రంథాలు నిక్షేపం చేస్తారు. గాంధీ నగర్ శ్రీకృష్ణమందిరంలో ఉదయం 10 గంటలకు ఆకుపూజ జరుగుతోంది. పప్పులవీధి ప్రసన్నఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం హనుమద్వ్రతం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయా ఆలయాల చైర్మన్లు కోరారు.

శీతాకాలంలో తియ్యని మామిడి పండ్లు!



వేసవి కాలంలోనే కన్పించే తియ్యని మామిడి పండ్లు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న శీతాకాల సమయంలో ప్రత్యక్షమై ప్రజలను ఆశ్చర్యపరిచాయి. గురువారం ఓ పక్క జోరువాన కురుస్తుండగా మరోపక్క నగరంలోని చింతారెడ్డి పాలెం సమీపంలో చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై దర్శనమి చ్చాయి. ఇవి చూసిన ప్రజలు వర్షాకాలంలో మామిడి పండ్లు ఏమిటని వ్యాపారులను ప్రశ్నించగా ఉలవపాడులో ముందస్తుగా పండే పునాస కాపు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఈ మామిడి పండ్లను కిలో రూ.200కు విక్రయించారు.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



అమరావతిలో సచివాలయంలో గురువారం జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

'పెరంకొండ' కదిలింది!

- ఫైల్‌ను విజిలెన్స్‌కు అప్పగించిన ప్రభుత్వం
- అక్రమాలపై క్షేత్రస్థాయిలో మొదలైన విచారణ
- ముంపు మాటున రూ.కోట్ల ప్రజాధనం దోపిడీ
- అధికారులు, దళారులు కుమ్మక్కై బరితెగింపు
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో నాడు జేసీ విచారణ
- అక్రమాలు తేల్చి ప్రభుత్వానికి నివేదిక అందజేత
- వైసీపీ ప్రభుత్వంలో తొక్కి పెట్టిన భోక్తలు

నెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ప్రాజెక్టు ముంపు కింద కలువాయి మండలం పెరంకొండ గ్రామం ఉన్నట్లుగా చూపించి సుమారు రూ.100 కోట్లను ఆర్‌అండ్‌ఆర్, పరిహారం కింద చెల్లించారు. అయితే ఈ గ్రామంలోని ఓ కాలనీ మాత్రమే ముంపునకు గురవుతుందని, మిగిలిన ఊరు ముంపు కిందకు రాదన్న ప్రచారముంది. కానీ తెలుగు గంగ అధికారులు మాత్రం ఈ గ్రామం మొత్తం ముంపు కిందకు వస్తుందని రికార్డు చేసి పరిహారం చెల్లించారు. ఇందులో సుమారు రూ.60 కోట్లను ఇళ్లు, ఇతర నిర్మాణాలకు పరిహారం కింద చెల్లించగా, మిగిలిన రూ.40 కోట్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద చెల్లించారు. ఇక్కడ మరో కుంభకోణానికి తెరలేపారు. పాత ఇళ్లకు కూడా కొత్త ఇళ్ల మాదిరి పరిహారం ఇచ్చారు. ఇక లేని ఇళ్లు కూడా ఉన్నట్లుగా చూపించి ప్రజాధనం దోచిపెట్టారు. ఈ అక్రమాలపై అప్పట్లో ఉన్నతాధికారులకు అనేక ఫిర్యా దులు అందాయి. స్పందించిన అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు విచారణకు ఆదేశించారు. తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ బాధ్యతలతో పాటు ఈ ఫిర్యాదులపై విచారణ బాధ్యతలను కూడా అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్‌కు అప్పగించారు. ఫిర్యాదులను, రికార్డులను పరిశీలించిన జేసీ, తదుపరి పెరంకొండలో స్వయంగా పర్యటించారు. సర్వే, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో రెండు నెలలపాటు పెరంకొండలోని ఇళ్లకు కొలతలు వేయించారు. ప్రతీ నిర్మాణానికి విలువ లెక్క గట్టించారు. ఈ అధికారుల బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం సుమారు రూ.26 కోట్లు మాత్రమే ఇళ్లు, ఇతర నిర్మాణాలకు పరిహారం కింద చెల్లించాల్సి ఉండగా దాదాపు రూ.59 కోట్లను చెల్లించినట్లు గుర్తించారు. సుమారు రూ.33 కోట్లకు పైగా ప్రజాధనం పక్కదారి పట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఎప్పుడో రెండు, మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లకు కూడా భారీ రేటు కట్టి పరిహారంగా చెల్లించారు. కొన్ని పూరిళ్లకు రూ.20 లక్షల వరకు చెల్లించడం గమనార్హం. ఇక పెరంకొండ గ్రామంలో దాదాపు 430 ఇళ్లకు పరిహారం చెల్లించడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీను కూడా అందజేశారు. అయితే సదరు పంచాయతీ అధికారులు మాత్రం 2016 అసెస్మెంట్ రికార్డు ప్రకారం సుమారు 220 ఇళ్ల మాత్రమే ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారని తెలుస్తోంది.

అంతా కుమ్మక్కై స్కామ్..!

పెరంకొండ అవినీతి వ్యవహారంలో ఓ అడ్వకేట్‌ది ప్రధాన పాత్ర అని జేసీ విచారణలో తేలింది. పరిహారం పొందిన లబ్ధిదారుల ఖాతాల నుంచి సదరు అడ్వకేట్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు భారీగా నగదు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. సుమారు రూ.5 కోట్లకు పైగానే నెల్లూరులోని ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి డబ్బులు మళ్లినట్లు నివేదికలో పేర్కొన్నారు. అటు అధికారులను, ఇటు పెరంకొండ గ్రామస్థులకు డబ్బులు ఆశచూపి కుంభకోణానికి తెరలేపింది ఈ దళారేనని విచారణలో గుర్తించారు. కాగా పెరంకొండ గ్రామంలోని ఇళ్ల నిర్మాణాలకు పరిహారం పొందిన వ్యక్తులు ఎక్కువగా నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు బ్యాంకులో సుమారు 236 ఖాతాలు తెరిచారు. ఎక్కడో అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామస్థులు తమ ఊరిలోని బ్యాంకులను కాదని, నెల్లూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఖాతాలు తెరవడంపై అనుమానాలు వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు ఆ దిశగా విచారణ జరిపారు. ఈ బ్యాంకు నుంచే సదరు అడ్వకేట్‌కు కూడా నగదు బదిలీ అవ్వడం, ఇవన్నీ అనుమానం కలిగిస్తున్న నేపథ్యంలో సదరు బ్యాంకుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఫిర్యాదు చేసే విధంగా కూడా అప్పట్లో జేసీ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా పెరంకొండ పునరావాస పంపిణీలో అవకతవకలకు 11 మంది వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు బాధ్యులుగా విచారణలో గుర్తించారు. గతంలో టీజీపీలో పనిచేసిన స్పెషల్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బాధ్యులను చేశారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో కూడా ఓ ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలను బాధ్యులుగా గుర్తించి వారిపై కూడా చర్యలకు సిఫార్సు చేశారు.

వేగంగా విజిలెన్స్ విచారణ

ఈ మొత్తం నివేదికను గతేడాది జూన్‌లో అప్పటి జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత ఫైల్ కదలకుండా రాష్ట్రస్థాయిలో తొక్కిపెట్టారు. ఇప్పుడు ఈ అక్రమాలపై మరోసారి విచారణ జరిపేందుకు నిర్ణయించిన ప్రభుత్వం ఆ బాధ్యతలను విజిలెన్స్ విభాగానికి అప్పగించింది. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయి విచారణకు దిగారు. మూడు రోజులపాటు పెరంకొండ గ్రామంలో పర్యటించి కండలేరు జలాశయం కాంటూర్‌ను నిర్ధారిస్తున్నారు. అయితే ముంపు కింద పరిహారం పొందిన ఈ గ్రామం ఇప్పటికీ ఖాళీ కాకపోవడం గమనార్హం. ఫిర్యాదుల్లో వచ్చినట్లు నిజంగానే ముంపు కిందన లేకపోతే ఆ గ్రామంలో ఇప్పటి వరకూ చెల్లించిన సుమారు రూ.100 కోట్లు పక్కదారి పట్టినట్లేనని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

పొదుపు మహిళల ఆన్‌లైన్ వ్యాపారం

- మైస్టోర్ యాప్‌లో ఉత్పత్తుల నమోదు
- ఓఎన్‌డీసీని ప్రవేశపెట్టిన కేంద్రం
- పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలు
- అతివలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ



తమ ఉత్పత్తులను మైస్టోర్ యాప్‌లో నమోదు చేయిస్తున్న పొదుపు మహిళలు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు ద్వారా ఖండాంతర ఖ్యాతినార్జించిన జిల్లాలోని పొదుపు మహిళలు తదనంతరం మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారు. భౌతికంగా చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న వారు తాజాగా ఆన్‌లైన్ వ్యాపారంలోకి అడుగుపెడుతున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్టు వంటి సంస్థలకు దీటుగా ఓఎన్‌డీసీను (ఓపెన్ నెట్‌వర్కింగ్ ఫర్ డిజిటల్ కామర్స్) భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన ఈ ఓఎన్‌డీసీలో జిల్లాకు చెందిన మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. ఇందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఓఎన్ డీసీ ద్వారా వ్యాపారాభివృద్ధి కోసం రూ.1 కోటి నుంచి 5 కోట్ల వరకు రుణాలు ఇప్పించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంతేగాక ఆన్‌లైన్ వ్యాపారం చేసే అవకాశం ఉన్నందున వారు తయారు చేసే ఉత్పత్తులకు మంచి మార్కెట్ సౌకర్యం కలుగుతుంది. దిగ్గజ సంస్థలకు పోటీగా కొనుగోలు దారులకు తక్కువ ధరకు వస్తువులు అందుబాటులో ఉంటాయి. అమ్మకందారుల నుంచి అన్ని రకాల ఉత్పత్తులు, సేవలు అందుబాటులో ఉంటాయి. అమ్మకందారులు, ఎలాంటి ప్లాట్‌ఫాం లేదా యాప్‌లను ఉపయోగించినా, వారు కనెక్ట్ అయి ఉంటే వారు ఒకరితో ఒకరు వర్తకం చేసుకోవచ్చు. ఈ ఓఎన్‌డీసీపై ఆన్‌లైన్ వ్యాపారాన్ని మహిళల చేత చేయించడానికి డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టబోతున్నారు. ప్లేస్టోర్ నుంచి మైస్టోర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమ వ్యాపార ఉత్పత్తులను నమోదు చేసుకున్న వెంటనే అనుమతి లభిస్తుంది. ఇందుకు సంబంధించి డీఆర్‌డీఏ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. మైస్టోర్ యాప్‌లో ఆర్డర్ పెట్టగానే కొనుగోలుదారు ముందుగానే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలి. సరుకు డెలివరీ అయ్యాకే సదరు నగదు ఉత్పత్తిదారుకు చేరుతుంది. ఇతర ఆన్‌లైన్ యాప్‌ల కమీషన్ కంటే పొదుపు మహిళలు అందించే ఆన్‌లైన్ ఉత్పత్తులకు తక్కువ కమీషన్ తీసుకుంటారు.

ఉత్పత్తులను నమోదు చేయిస్తున్నాం



జిల్లాలోని పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయానికి మైస్టోర్ యాప్‌లో నమోదు చేయిస్తున్నాము. ఇందుకు వారికి అవగాహన కూడా కల్పిస్తున్నాం. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓఎన్‌డీసీ కార్యక్రమం ద్వారా మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. ఆన్‌లైన్ ద్వారా వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం. తద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పించి, వారిద్వారా పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

274 మంది నమోదు

మైస్టోర్ యాప్‌లో 274 మంది పొదుపు మహిళలు అమ్మకందారులుగా నమోదై ఉన్నారు. జిల్లాలో మొత్తం 1,587 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మహిళలు స్థాపించి ఉన్నారు. ఇప్పటివరకు మూడు విడతల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు మంజూరు చేశారు. 1587 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.40 వేల వంతున మంజూరు చేయగా, కాఫీపొడి, వెన్నతీసే మిషన్లు, ప్యాకింగ్, పచ్చళ్ల తయారీ పరిశ్రమలను మహిళలు ఏర్పాటు చేశారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు జీవనోపాధి కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రధాన మంత్రి పార్మలేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ స్కీం (పీఎంఎఫ్‌ఎంఈ), ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా రూ.లక్ష నుంచి 10 లక్షల వరకు యంత్రాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తారు. వ్యక్తిగతంగా లేదా సంఘాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు రాయితీలు కూడా ఇస్తారు. రూ.10 లక్షల యూనిట్ ఖర్చుతో ఏర్పాటు చేసే పరిశ్రమలకు లైసెన్సులు, జీఎస్‌టీ తదితరాలు అవసరం లేదు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని బాగా అభివృద్ధి చేయడానికి ఆ రంగ ఉత్పత్తులను ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ విధానంతో టైఅప్ చేయడానికి డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు.

జాతీయస్థాయి షార్ట్‌పుట్ పోటీలో రజతం



ఆర్టీసీ కానిస్టేబుల్ చంద్రశేఖర్

ఉలవపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఈర్ల చంద్రశేఖర్ ఏఎస్ఆర్‌టీయూ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో గురువారం జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో షార్ట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి రజత పతకం సాధించాడు. అలాగే విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీఎస్ ఆర్టీసీ అథ్లెటిక్స్‌లో కావలి ఆర్టీసీ డిపోలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నచంద్రశేఖర్ మొదటిస్థానంతో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. జాతీయస్థాయిలో పతకం సాధించిన చంద్రశేఖర్‌ను గ్రామస్థులు, స్నేహితులు, కావలి డిపో అధికారులు అభినందించారు.

జాతీయ రహదారి దొంగలకు రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మారణాయుధాలతో వాహన చోదకులను బెదిరించే దొంగలను చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అంకమ్మలు తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. బోగోలు మండలం అల్లిమడుగు సంఘం పిరిగ రమేష్, మల్లీ దివ్యతేజలు ఉలవపాడు జాతీయ రహదారి వీరేపల్లి అడ్డరోడ్డు బస్‌షల్టర్ వద్ద ఈ నెల 8న కావలి మండలం చెన్నాయపాలెం బుట్టి వెంకట్రావు ద్విచక్ర వాహనంపై ఆగి ఉండగా అతని వద్దకు వచ్చిన వీరు కత్తి చూపించి బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లారు. బాధితుడు ఈ విషయంపై ఉలవపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో దుండగులు ఆనవాళ్లు, వారు ఉపయోగించిన యూనికాన్ మోటార్ బైక్‌ను రాతపూర్వకంగా తెలిపాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ అంకమ్మ దర్యాప్తు చేపట్టారు. గురువారం కందుకూరు సీఐ, ఎస్సైలు హైవేపై రాజుపాలెం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కావలి వైపు నుంచి యూనికాన్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను ఆపి వివరాలు అడిగే క్రమంలో పొంతనలేని మాటలు చెప్పడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా నిజాలు బయటపెట్టారు. ఇద్దరి నుంచి ఒక కత్తి, దొంగిలించబడిన సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై పలు స్టేషన్లలో పలురకాల కేసులు నమోదై ఉనానయి. రమేష్‌పై రౌడీషీట్, దివ్యతేజపై సస్పెక్ట్ షీటు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందుతులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని కందుకూరు డీఎస్పీ సుబ్రహ్మణ్యం అభినందించారు.

మెయింటెనెన్స్ లేకనే !

(5వ పేజీ తరువాయి)



రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ పూజిత తదితరులు

శ్రీపూజ పరిశీలించారు. స్కూబా డైవర్లతో చర్చించి, రైతులకు నీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

మోటార్ల ద్వారా నీరిచేందుకు చర్యలు

గేటు తొలగింపు పనులు ఆలస్యమవుతుండటంతో ప్రత్యామ్నాయంగా మోటార్ల ద్వారా నీటిని తూములోకి పంపి కాలువకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందుగా సైఫన్ పద్ధతిలో నీరిచ్చేందుకు పైపును నీళ్లలో వేసి దాని నుంచి తూములోకి నీరు పంపేందుకు ప్రయత్నించారు. అయితే, ఆ ప్రయత్నం విఫలం కావడంతో ప్రకాశం జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్ఈ అబ్దుల్ తలీమ్, ప్రాజెక్టు డీఈలు వెంకటేశ్వర్లు, మధుసూదనరావులతో గేటు తొలగింపులో ఆలస్యం, రైతులకు నీరు ఎలా ఇవ్వాలని చర్చల్లో నిమగ్నమయ్యారు. గేటు తొలగింపు పనులు జరిగే వరకు రైతులకు నీరివ్వాలని నిర్ణయించారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా కోన శశిధర్

(5వ పేజీ తరువాయి)

కొనసాగుతున్నారు. అలాగే, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ డీడీగా సుశీల నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న పీడీ హేనా సుజన్ పదోన్నతిపై ఒంగోలు ఐసీడీఎస్ పీడీగా నియమితులయ్యారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె.అర్జున్ నాయక్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన ప్రకాశం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పని చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలి

- ఆత్మ పీడీ శివన్నారాయణ



మాట్లాడుతున్న ఆత్మ పీడీ శివన్నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంటలకు ఆశించే చీడ పీడల నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఆత్మ పీడీ జీ.శివన్నారాయణ సూచించారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్ల పరిధిలోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ఆధ్వర్యంలో వారి సామర్థ్యం పెంపుదలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందేలా చూడాలని సూచించారు. డ్రోన్ల సహాయంతో పురుగు మందులు, ఎరువులు పిచికారి చేయడం వల్ల కూలీల కొరతను అధిగమించవచ్చని, అంతేకాకుండా ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. వరి నాట్లు సకాలంలో వేయకపోవడం వల్ల వచ్చే లోటుపాట్లను పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏలు మారుతిదేవి, లక్ష్మీమాధవి, డీఏవో కార్యాలయం ఏడీఏ నర్సోజీరావు, పలువురు మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులకు రూ. 8 కోట్ల మంజూరు

- సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు



వసతిగృహం ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ

సంగం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు సుమారు రూ. 8 కోట్ల నిధులు మంజూరయ్యాయని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఎస్సీ బాలిక వసతి గృహాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వసతిగృహం చుట్టూ నిలిచిన నీటిని బయటకు తొలగించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 71 సాంఘీక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని, వీటిలో 65 ప్రభుత్వ భవనాలు కాగా, 6 అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. వీటిల్లో 4,656 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. పదవ తరగతిలో పదిమంది విద్యార్థులుంటే ట్యూటర్లను నియమిస్తున్నామన్నారు. ఈ ఏడాది మంచి ఉత్తీర్ణత శాతం సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భవనాల్లో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు రూ. 10.16 లక్షలతో ప్రతిపాదనలు పంపగా రూ. 8 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. సోషల్ వెల్ఫేర్ విభాగం ఇంజనీరింగ్ అధికారులు త్వరలో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్!



కలువాయిలో కొండ చిలువ హల్‌చల్ చేసింది. బుధవారం రాత్రి పొద్దు పోయాక స్థానిక శివసాయి కళాశాల సమీపంలో సోమశిల-పొదల కూరు మెయిన్‌రోడ్డును కొండచిలువ దాటుతుండగా స్థానిక యువకులు కొందరు గమనించారు. 8 అడుగుల పొడవు కలిగిన దీన్ని అక్కడే ఫాస్ట్‌ఫుడ్ దుకాణంలో పనిచేసే యువకులు పట్టుకుని గోతాములో పెట్టుకుని ఊరికి దూరంగా తెలుగుగంగ కాలువలో వదిలిపెట్టారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

బిందెడు నీటి కోసం పొలంబాట



గుక్కెడు నీటి కోసం పొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొందని కాంచెరువు ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో తాగునీటిని సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాధుడే లేడని, దీంతో నిత్యం బిందెలు పట్టుకొని సమీప పొలాలకు పరుగులు తీయాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మోటార్ల వద్ద ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందో నని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

- వరికుంటపాడు, (ఆంధ్రజ్యోతి)

చెరువు దాటితేనే చదువులు




గత వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలలకు రంగులు, అదనపు భవనాలకు నిధులు మంజూరు చేసినట్లు నాయకులు ప్రగల్భాలు పలికారు. కానీ పాఠశాలల పరిసరాలు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. వానొస్తే సర్కారు బడుల ప్రాంగణం చెరువుల్లా, చిత్తడిలా మారుతున్నాయి. అందుకు ఉదాహరణే ఈ చిత్రం. కొడవలూరు మండలం కొత్త వంగళ్లు, గాంధీజన సంఘం ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులకు వెళ్లాలంటే విద్యార్థులు చెరువులా ఉండే ఈ మడుగును దాటాలి. ఈ రెండు బడులకు ప్రహరీ లేక విషపురుగులు, సర్పాలు ప్రాంగణంలో సంచరిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టి, వీటిని బాగుచేయాల్సి ఉంది.

- కొడవలూరు, (ఆంధ్రజ్యోతి)

ఐటీఐలు నైపుణ్య కేంద్రాలు

● అత్యాధునిక వసతులకు చర్యలు ● జిల్లా కన్వీనర్ శ్రీధర్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(విద్య), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐటీఐలు నైపుణ్య కేంద్రాలుగా మారడంతో పాటు ఎంతో మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్, వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఐటీఐలలో వస్తున్న మార్పులు, అభివృద్ధి పనులపై ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐటీఐలకు మరింత డిమాండ్ పెరగడంతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగ కల్పనకు ప్రాధన్యమిస్తుండడంతో వీటిల్లో చేరేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. దీనికి తోడు నూతన కోర్సులను ప్రవేశ పెడుతుండడంతో ఉపాధి కేంద్రాలుగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోందని, అత్యాధునిక వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మితమైన బాలుర ఐటీఐ కళాశాలకు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.1.80 కోట్లతో భవనాలు ఆధునీకరణ, తరగతి గదుల నిర్మాణం, వర్క్‌షాప్ ల్యాబ్స్ ఆధునీకరించడంతోపాటు నూతన టాయిలెట్స్ నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. పీఎంకేవీవై, పీఎం విశ్వకర్మ వంటి కొత్త కోర్సులు నిర్వహించడంతో పాటు స్కిల్‌హబ్‌లో ప్రత్యేక శిక్షణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. పీఎం విశ్వకర్మ కోర్సుల్లో ధోబీ, బార్బర్, కార్పెంటర్‌లలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు శిక్షణ అందిస్తున్నారన్నారు. జిల్లాలో ప్రభుత్వ లీడ్ సెక్టార్ కింద గుర్తించిన ఎడిబుల్ ఆయిల్ ఇండస్ట్రీస్, కృష్ణపట్నం పోర్టులలో ఐటీఐ చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉపాధి కల్పించే క్రమంలో కొత్త కోర్సుల కోసం ప్రతిపాద నలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దర్శనానికి వెళ్లి వచ్చేలోగా బస్సు మాయం

● బాధితుల ఫిర్యాదుతో పోలీసుల స్వాధీనం



పోలీసులు అదుపులోకి తీసుకున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

వెంకటాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద గురువారం వేకువజామున నెల్లూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకి చెందిన కొందరు అయ్యప్ప భక్తులు దైవదర్శ నానికి తిరుమలకు ప్రైవేటు ట్రావెల్ బస్సులో వెళ్లారు. అయితే స్వామి వారిని దర్శనం చేసుకొని తిరిగి వచ్చేసరికి బస్సు కనిపించలేదు. డ్రైవర్‌కు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో 112 ద్వారా పోలీసులకు భక్తులు సమాచారం అందించారు. అలాగే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు బస్సు ఎక్కడ ఉందో ట్రేస్ చేశారు. చివరకు వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు బస్సును ఆపి స్వాధీనం చేసుకున్నారు.అనంతరం స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

గిరిజనుడి మృతి కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

రాపూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడవి పందులను వేటాడే క్రమంలో ఈ నెల 7వ తేదీన నాటుతుపాకీ గుండు తగిలి తాళ్ల సుధాకర్ అనే గిరిజనుడు మృతిచెందిన ఘటనలో నిందితుడు శౌంరి మణిని అరెస్టు చేసినట్లు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. రాపూరు సర్కిల్ కార్యాలయంలో సీఐ విజయకృష్ణతో కలిసి ఆత్మకూరు డీఎస్పీ గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటు తుపాకీ గుండు తగిలి తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చే లోపే మృతిచెందాడని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని ముక్కుతిప్ప అటవీ ప్రాంతంలో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో రాపూరు ఎస్‌ఐ వెంకటరాజేష్ పాల్గొన్నారు.

ఫోర్జరీ, చీటింగ్ కేసులో మూడేళ్ల జైలు

● రూ.40 వేల జరిమానా

నెల్లూరు(లీగల్), డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): తనది కాని పొలం తనదని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అడంగల్, ఫసలీ-1419 పత్రాలు పొంది ఇతరులకు విక్రయించాడన్న కేసులో నిందితుడికి సహకరించిన బొణిగల శ్రీనివాసులుకు 3 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధిస్తూ నెల్లూరు నగర స్పెషల్ ఎక్సైజ్ జ్యుడీషియల్ న్యాయాధికారి టీ.సుయోధన్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముత్తుకూరు మండలం పంటపాళెం గ్రామం ఈపూరు బిట్-1కి చెందిన నామాలా మోహన్‌రెడ్డి తాను కల్లూరుపల్లిలోని సర్వేనెం. 49 బై 10లో కొంత పొలాన్ని కొనుగోలు చేశానని, తనకు అడంగల్, 1419 ఫసలీకి సంబంధించి పేపర్లు కావాలని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నెల్లూరు రూరల్ మండల కార్యాలయంలో 2011 జూన్ 6వ తేదీన దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సదరు కాపీలను మండల కార్యాలయంలోని ప్రజా సేవా కేంద్రంలో కంప్యూటర్ సెక్షన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకు చెందిన బొణిగల శ్రీనివాసులు అతనికి పోర్జరీ సంతకాలతో అందజేశాడు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి నెల్లూరు తహసీల్దారు ఇస్కా భక్తవత్సల్‌రెడ్డి నిందితులిద్దరిపై నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై సెక్షన్ 420, 465, 471, 471 రెడ్ విత్ 109 ఐపీసీల కింది కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ కాలంలో నిందితులిద్దరిపై నేరం రుజువైంది. అయితే గురువారం 1వ నిందితుడు నామాల మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరు కాకపోవడంతో అయనకు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను న్యాయాధికారి జారీ చేశారు. అలాగే కోర్టుకు హాజరైన రెండవ నిందితుడికి ప్రతి సెక్షన్‌లోనూ మూడేళ్ల వంతున జైలు శిక్షతోపాటు ఒక్కో దానికి రూ.10 వేల వంతున జరిమానా విధించారు. ఈ శిక్షలన్నీ ఏక కాలంలో అనుభవించాలని న్యాయాధికారి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ టీ.లీలాకుమారి వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	95
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7516
వెండి కిలో ధర	రూ. 96,400
వెండి ఒక గ్రాము	రూ.99.40

మామిడి రైతుకు తీపి కబురు

కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు తీపి కబురు అందజేసింది. దశాబ్దాలుగా సాగుదారులు డిమాండ్ చేస్తున్న బీమా సదుపాయాన్ని కల్పించింది. పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం)లో మామిడిని చేర్చింది. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటను కోల్పోయే మామిడి రైతులకు ఉపశమనం లభించనుంది.



కొరిమెర్లలో సాగులో ఉన్న మామిడి తోటలు

- పంటల బీమాలో 'ఫలరాజు'కు స్థానం
- ఎకరాకు ప్రీమియం కింద రూ.2,250
- పంట నష్టం జరిగితే రూ.45 వేల పరిహారం
- ఈ నెల 15 వరకు గడువు.. పెంచాలంటున్న రైతులు

సంగం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా జిల్లావ్యాప్తంగా మామిడి తోటల సాగు గణనీయంగా పెరిగింది. విస్తీర్ణం పెరిగి చాలా మంది రైతులకు లబ్ధి చేకూరుతున్నా మామిడి పంటకు బీమా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడికి బీమా వర్తింపజేయాలని ఏళ్ల తరబడి రైతులు చేస్తున్న పోరాటం ఫలించింది. కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగినప్పుడు ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ (2024-25)లో ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకాన్ని మామిడికి వర్తింపజేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పథకంలో మామిడి తోటలు ఎక్కువగా ఉన్న నెల్లూరు జిల్లాకు కూడా చోటుదక్కింది. దీంతో జిల్లాలో 11 వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్న సుమారు 8వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. సంగం మండలంలో కొరిమెర్ల, వెంగారెడ్డిపాళెం, పడమటిపాలెం, వీర్లగుడిపాడు, మర్రిపాడు, దువ్వూరు తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

● ఎకరాకు రూ.2,250 ప్రీమియం

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకంలో లబ్ధి పొందాలంటే ఎకరా మామిడి తోటకు రైతు వాటాగా రూ.2,250 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ప్రీమియం చెల్లించిన రైతులకు వాతావరణం మార్పుల వల్ల నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.45 వేల పరిహారం లభించే అవకాశం ఉంది. ప్రీమియం చెల్లించిన రోజు నుంచి బీమా వర్తిస్తుంది. పంట నష్టం కూడా 15-012-2024 నుంచి 31-5-2025 మధ్య కాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలి వేగం, చీడపీడల ఉధృతి వంటి పరిణామాలను పరిగణించి పరిహారం లెక్కిస్తారు. మండల స్థాయి అధికారులు నష్టాన్ని లెక్కించి పరిహారాన్ని నిర్ణయిస్తారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అయితే, గడువు తేదీని పొడిగించాలని రైతాంగం కోరుతోంది. కాగా, అక్టోబరు 1, 2020 ముందు అనగా ఐదేళ్ల ముందు మామిడి తోటలు పెట్టిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

● దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఒక రైతు ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేసుకోవచ్చు. భూమి పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల వద్ద పంట వేసినట్లు తీసుకున్న ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలో ఉన్న బ్యాంకు లేదా కామన్ సర్వీస్ (సీఎస్‌సీ) సెంటర్ లేదా మీసేవ, పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్‌లో నేరుగా రైతులే నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నో ఏళ్ల నిరీక్షణ తరువాత ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అందుబాటులోకి వచ్చింది. ఉద్యాన శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 15 నాటికి గడువు ముగుస్తుం డగా, ఈ నెలాఖరు వరకు పొడిగించే అవకాశం ఉంది. మామిడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

- ఏవీ సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఫిబ్రవరిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు

● జిల్లా కార్యదర్శి మూలం రమేష్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 1,2,3వ తేదీలలో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం మహాసభల ఆహ్వాన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నెల్లూరులో 1978లో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరిగాయని, 46 ఏళ్ల తర్వాత మళ్లీ నెల్లూరు వేదిక కానుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విప్లవాలకు నిలయంగా ఉన్న సింహపురి పురిటి గడ్డపై ఈ మహాసభలు జరగనుండడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ మహాసభలను పార్టీ నేతలు, కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, అబ్బాయిరెడ్డి, వెంకటేశ్వర్లు, అంకయ్య, టీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించకుండా.. హరికథలు చెప్పొద్దు

● ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం



ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం పీడీ గంగాభవానీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలు సాధించ కుండా తనకు హరికథలు చెప్పొద్దు.. కూలీలచే పనులు చేయించ లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోండి.. తాము కొత్తవారిని నియమించుకుంటామంటూ డ్వామా పీడీ గంగాభవానీ ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బందితో క్లస్టర్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 70 శాతం లక్ష్యాలను పూర్తిచేశామని, మార్చి చివరినాటికి నూరు శాతం లక్ష్యాలను సాధిస్తామన్నారు. కాగా, తొమ్మిది నెలలు కావస్తున్నా కొంతమంది సిబ్బంది లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నారని మండిపడ్డారు. అలాంటి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈనెల చివరికి లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించకపోతే చివరిసారిగా నోటీసు జారీ చర్యలు చేపడతామన్నారు. ప్రతి బుధవారం నిర్వహించే రివ్యూ సమావేశాలలో లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ఆ దిశగా పయనించాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. జిల్లాలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా రూ.80 కోట్లతో సిమెంట్‌రోడ్లు, రూ.30 కోట్లతో గోకులం షెడ్‌ల నిర్మాణం చేపడుతున్నామని, డిసెంబరు చివరినాటికి పూర్తిచేస్తామన్నారు. ఉదయగిరి క్లస్టర్‌లో సీతారామపురం, ఉదయగిరి మండలాలు లక్ష్యాల సాధనలో ముందంజలో ఉండగా, జలదంకి మండలం వెనుకబడి ఉందన్నారు. మిగిలిన మండలాలు ఆశాజనంగా ఉన్నాయన్నారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీవో అప్పాజీ, ఎనిమిది మండలాల ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీని కలిసిన వేమిరెడ్డి దంపతులు



ప్రధాని మోదీని సత్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం మరింత పురోగమిస్తుందని పేర్కొన్నారు.

● జిల్లాలో జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లను తగ్గించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఏమిటని గురువారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖమంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ నెల్లూరు జిల్లాలోని జాతీయ రహదారులపై 71 బ్లాక్ స్పాట్లు గుర్తించామన్నారు.

● ఆంధ్రప్రదేశ్‌లో పౌర విమానయానం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటని లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహల్ సమాధానమిస్తూ ఏపీలో 6 విమానాశ్రయాలు ఉండగా, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల ప్రతిపాదనలో దగదర్తి, భోగాపురం, ఓర్వకల్ ఉన్నాయని చెప్పారు.

పోతన భాగవతం జనరంజకం

● డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ



డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సుభద్రాదేవి, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పోతన రచించన భాగవతం భక్తితోపాటు ప్రజలకు ఉపయోగపడే జీవన విధానాలను తెలిసేలా సాగిందని తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం టౌనుహాల్ ఆవరణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పోతన భాగవతం, కవితా వైభవం అనే అంశంపై ఉపన్యసించారు. భాగవతం రమణీయ, కమనీయ కవితా శిల్పం అని పేర్కొన్నారు. పోతన కవిత్వం అర్థం, శబ్దాడంబరం కలిగినదని పేర్కొన్నారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు, వీఆర్ కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ భాగవతంలోని పద్యాలు శ్రావ్యమైనవని చెప్పారు. నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి మాట్లాడుతూ భాగవతం తెలియని తెలుగువారు ఉండరన్నారు. అనంతరం డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశం, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో బాలసాహిత్య రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ఆర్.నారాయణస్వామి, వై.విశ్వనాథం, దుర్గా మురళీకృష్ణ, సుబ్బారాయుడు, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుపూరులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... కోవూరుకి చెందిన కరీ ముల్లా, ఇబ్రహీమ్ మోటార్ బైక్‌పై కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి వస్తుండగా, కనుపూరు సమీపంలో ఉన్న మలుపు వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈప్రమాదంలో వారిద్దరు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వెంకటాచలం ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

27వ రోజుకు మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో జరు గుతున్న మండల పూజలు గురువారం 27 వ రోజుకి చేరాయి. ఉదయం పాలభిషేకాలు, గ ణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, అన్నదాన కార్యక్ర మాలు జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ, మహాదీపారాధన, భగవతీసేవ, అత్తాళంపూజ, హరిహరవాసనం జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా బట్టేపాటి ప్రసాద్, మాధవి దంపతులు, అక్కెంరెడ్డి జనార్దన్‌రెడ్డి, సుమతీరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈ కా ర్యక్రమాలను ఆలయ చైర్మన్ జీ.శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి కే వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే చర్యలు

● ఎక్సైజ్ సీఐ బీ. వెంకటరావు



కందుకూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసినా, వారికి మద్యం సరఫరా చేసినా చర్యలు తప్పవని వాటి నిర్మూలనకు నిరంతర నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు కందుకూరు ఎక్సైజ్ సీఐ బీ.వెంకటరావు తెలిపారు.

? బెల్ట్‌షాపులపై మీ చర్యలేమి.

! బెల్ట్‌షాపుల నిర్మూలనకు నిరంతర నిఘా పెట్టి తనిఖీలు నిర్వహి స్తున్నాం. నూతన మద్యం పా లసీ అమల్లోకి వచ్చాక అన, ధికారికంగా మద్యం నిల్వ చేసి ఉన్న 14మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాం. వారివ ద్ద 187 మద్యం సీసాల ను స్వాధీనం చేసుకున్నాం.

? లైసెన్సుదారులపై చర్యలు తీసుకుంటున్నారా.

! దొరికిన మద్యం సీసాలపై త గిన ఆధారాలు లభించలే దు. అయితే దుకాణదారులతో స మావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. బెల్ట్‌షాపుల్లో పట్టుబడితే తొలి సారి రూ.5లక్షలు జరిమానా, రెండవ సారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నాం. అలాగే సమయపాలన, ఎంఆర్పీల అమలుపై కూడా గట్టి నిఘా ఉంచాం.

? ఉదయం వేళల్లో అనధికారిక విక్రమాలు జరుగుతున్నాయా.

! మాతో పాటు ఇటీవల టాస్క్‌ఫోర్స్ బృం దాలు కూడా తనిఖీలు చేపడుతున్నారు. ఉ దయం వేళల్లో విక్రయాలపై ఫిర్యాదులు వ స్తున్న చోట నిఘా పెంచుతున్నాం.

ఇంటికే కాదు చెట్టుకూ మీటరు ఉంది..



ఇప్పటివరకు మనం ఇళ్లకు విద్యుత్ మీటర్లను చూశాం. చెట్లకు కూడా విద్యుత్ మీటర్లు ఇవ్వడం చూడాలంటే మీరు కావలి పట్టణానికి వెళ్లాల్సిందే. ఎలాంటి నిర్మాణాలు లేని, రోడ్ల వెంబడి ఉన్న బంకులకే కాకుండా రోడ్ల వెంబడి చిరు వ్యాపారం చేసుకునే వారికి కూడా కావలిలో విద్యుత్ మీటర్లు బిగిస్తున్నారు. చెట్ల కింద వ్యాపారాలు చేసుకునే వారికీ విద్యుత్ మీటరు బిగించారు. పట్టణంలోని ట్రంకు రోడ్డు వెంబడి నిత్యం రద్దీగా ఉండే ఎన్టీఆర్ విగ్రహం పక్కనే ఓ చెట్టుకు మీటర్‌ను ఏర్పాటు చేశారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

పొగాకులో సస్యరక్షణ
చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొగాకు పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కందుకూరు పొగాకు బోర్డు 27వ వేలం కేంద్రం నిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని శాఖవరం గ్రామంలో గురువారం పొగాకు పంటలో సమగ్ర సస్యరక్షణ, రసాయన అవశేషాలు నిర్మూలన, ఎన్‌టీఆర్‌ఎం నిర్మూలనపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పొగాకు పంటలో సిటీఆర్‌ఐ అధికారులు సూచించిన పురుగుమందులు అవసరమైన మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడ్ ఆఫీసర్ శివకుమార్, 26వ వేలం కేంద్రం నిర్వాహణాధికారి కిరణ్, పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దిమ్మె కూలితే పరిస్థితి ఏంటి ?



ముసునూరు బాలాజీవీధిలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫారం ఏర్పా టు చేశారు. కొన్నేళ్ల కిందట నిర్మించిన దిమ్మె కావడంతో అది నేడు పగుళ్లిచ్చి పూ ర్తిగా దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షా లకు దిమ్మె నానుతూ కూలితే ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై పడి అటువైపు వాహనా లపై వెళ్లే వారిపై పడే ప్రమాదం ఉంది. ట్రాన్స్ కో అధికారులు స్పందించి ప్ర మాదం జరుగక ముందే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

మామూళ్లకు చెక్ పడినట్టేనా?

● చలానా తప్ప మామూళ్లు ఇవ్వొద్దు ● కార్యాలయంలో ఫ్లెక్సీ ఏర్పాటు
● కావలి సబ్ రిజిస్ట్రార్‌లో కొత్త సంప్రదాయం

కావలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదాయం వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కావలి ఒకటి. ఇక్కడ ప్రతిపనికి ఒక రేటు ఉం టుందనేది బహిరంగ రహస్యం. ఇటీవల కావలి సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. అలాంటి కావలిలో అవినీతి రహిత పాలన అందిస్తానని ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ సుమలతారెడ్డి ఏకంగా కార్యాలయంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. అంతటితో సరిపెట్టుకో కుండా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రతిఒక్కరూ చలా నాలు కట్టు కోవటం తప్ప దళారులు, మధ్యవ ర్తు లకు నగదు చెల్లించవద్దని మరీ చెబుతున్నా రు. ఈ విషయం ప్రస్తుతం కావలిలో చర్చనీ యాం శంగా మారింది. అయితే ఆమె అవినీతికి దూరం గా నిజాయితీగా పని చేస్తుందనుకుంటే పొరపా టే. ఆమె కావలికి సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన నాటి నుంచి మామూళ్లు తీసుకోకుండా రిజిస్ట్రేషన్‌లు చే స్తే ఆమె నిజాయితీకి అందరూ జేజేలు పలికే



కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వారు. ఆమె కావలిలో జాయిన్ అయిన త ర్వాత రెండు నెలలు మామూళ్లు తీసుకుని రిజి స్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత వివాదాల కారణంగా నెల రో జులు సెలవుపై వెళ్లారు. అయితే సెలవుపై వెళ్లే రోజు మాత్రం మామూళ్లు తీసుకోకుండానే రిజి స్ట్రేషన్‌లు చేసింది. తర్వాత ఇన్‌చార్జి పాలనలో మామూళ్ల పర్వం యధాప్రకారంగా కొనసా గిం ది. మరలా ఆమె సెలవు నుంచి వచ్చిన తర్వాత రెండురోజులు పాటు యధాప్రకారం మామూళ్లు తీసుకున్నారు. అయితే కావలి సబ్ రిజిస్ట్రార్‌గా కొ నసాగేందుకు ఆమెకు స్థానిక ఎమ్మెల్యే నుంచి స రైన సహకారం లేదనే భావంతో ప్ర జల దృష్టి లో పడేందుకు మామూళ్లకు స్వస్తి పలికారని కొం దరు చెబుతున్నారు. మరికొందరు మాత్రం తాను ఎలాగూ కావలిలో కొనసాగటం కష్టంగా ఉ న్నం దును మామూళ్లు తీసుకోకుండా రిజిస్ట్రేషన్లు చేస్తే ఇక్కడకు కొత్తవారు రావటానికి సాహసిం చరనే భావంతో ఉన్నారు. ఈ కొత్త సాంప్రదాయం ఎం తకాలం కొనసాగుతుందో చూడాలి మరి.



కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నిజమైన హక్కుదారుల కోసమే మీ భూమి-మీ హక్కు

లింగసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజమైన భూ హక్కుదారుల కోసమే మీ భూమి - మీ హక్కు పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కం దుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలి పా రు. గురువారం పెంట్రాల సచివాలయంలో నిర్వ హించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రీ సర్వే పేరుతో రైతు లకు అన్యాయం చేసిందన్నారు. ప్రతిఅర్జీని పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనం తరం కందుకూరు సబ్ కలె క్టర్ తిరుమణి శ్రీపూజ మాట్లాడారు. గతంలో జరిగిన ఫ్రీహోల్డ్‌లో ఏవైనా అవకతవకలుంటే ఫిర్యాదు చేయాలన్నారు. పేదల నుండి అసైన్డ్‌మెంట్ భూములున్న వారు కొంటే వాటిని రద్దు చేసి పేదలకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అర్జీలు సమ ర్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు సీతామహా లక్ష్మీ, ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓ వినోద్, సర్వే య రు వెంకటేష్, కిలారి కొండయ్య, మద్దెల రామా రావు, వెంకటేశ్వర్లు, రంగయ్య పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: గ్రామాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్య లను పరిష్కరిండానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న ట్లు తహసీల్దారు అబ్దుల్‌అమీద్ తెలిపారు. స్థానిక గ్రామ పంచా యతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసాద్, ఎండోమెంట్ ఈఓ పావని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● కొండాపురం: వెళిగండ్లలో సదస్సులో 8మం ది రైతులు వినతులు అందినట్లు తహసీల్దార్ కోటే శ్వరరావు తెలిపారు. వినతులను పరిశీలించి పరి



కావలి: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్



ఉదయగిరి రూరల్: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు నాగరాజు

ష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, స ర్వేయర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● కావలి రూరల్: తహసీల్దారు శ్రావణ్ కు మార్ తాళ్లపాలెంలో జరిగిన సదస్సులో పాల్గొని 15అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ త హసీల్దారు నరసారెడ్డి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో మహేంద్ర పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు వివిధరకాల భూ సమ స్యలపై 46అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపా రు. ఆర్‌ఐ షేక్ వాజీద్, సర్వేరు శ్రీనివాసులురెడ్డి, వీఆర్వో శివ, సచివాలయ సర్వేరు అశోక్ ఉన్నారు.

● సంగం: మండలంలోని కోలగట్లలో గురువా రం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లా నాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలపై స్థానిక రెవెన్యూ అధికారులతో చర్చిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రె వెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చే సుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: మండలంలోని జీ.చెరువు పల్లిలో తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు ని ర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు ప లు సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను ప రిశీలించి పరిష్కారమార్గం చూపుతామని ఆమె తె లిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీ.గీత, ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: మండలంలోని పాపంపల్లిలో తహసీల్దారు వై.నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు, రైతులు అందజేసిన అర్జీలను స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనసాని ఆదెమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడు: తహసీల్దారు హేమంత్ కు మార్ గొల్లపల్లి, తోటలచెరువుపల్లి గ్రామాల్లో నిర్వ హించిన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, నాయ కులు గంగవరపు పుల్లయ్య, గంగవరపు శివరా మయ్య, పగడాల హజరత్తయ్య, దొడ్ల మౌలాలి, కాకుమాను ప్రసాద్, నూల కాశి పాల్గొన్నారు.

నాగంపల్లి, పెద్దనాగంపల్లిలో..

●సీతారామపురం: మండల పరిధిలోని చిన్న నాగంపల్లి గ్రామ పంచాయతీలోని పెద్దనా గంప ల్లిలో గురువారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతు లు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజే శారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయ ర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో బాలయ్య పాల్గొన్నారు.

రైల్వేగేట్ల స్థానంలో ఆర్వోబీ, ఆర్‌యూబీల ఏర్పాటు

● రైల్వే అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్థలాల పరిశీలన

కావలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):నియోజక వర్గంలోని దగదర్తి మండలం నుంచి కావలి రూర ల్ వరకు విస్తరించి ఉన్న రైల్వే లైన్‌పై ఉన్న గేట్ల స్థానంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ), రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లను ఏర్పాటు చేస్తామని ఎమ్మె ల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. గురు వారం దక్షిణమధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఇం జనీరు కేడీఎస్ క్రిష్ణ తమ సిబ్బందితో ఎమ్మెల్యే చౌదరిపాలెం రైల్వే గేట్, పమిడి స్కూల్ రైల్వేగేట్, కచ్చేరి మిట్ట ప్రాంతంల్లో ఆర్వోబీ వంతెన ప్రాం తం, పైడ్డపవని రైల్వేగేట్ ప్రాంతాలను పరిశీలిం చారు. వంతెనల నిర్మాణాల ఆవశ్యకతను రైల్వే అ ధికారుల దృష్టికి తీసుకెళ్లగా వీటిపై త్వరలో డీపీ ఆర్ తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తా మని రైల్వే సీనియర్ ఇంజనీర్ క్రిష్ణ ఎమ్మెల్యేకు తె లిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పెద్దప వని రైల్వే గేట్ వద్ద తక్కువ ఖర్చుతో స్థానిక ప్ర జలకు అనుకూలంగా రైల్వే అండర్‌పాస్ వంతెన ని ర్మాణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రమా దాలు, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తూ పట్టణం లోని ప్రతి ప్రాంతాన్ని అనుసంధానం చేయటానికి ఈ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమి



ముసునూరు పమిడి రైల్వే గేట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, రైల్వే అధికారులు

రెడ్డి సహకారంతో వంతెనల నిర్మాణం త్వరితగతిన జరిగేట్లుగా రైల్వే అధికారుల పనితీరు వేగవంతం గా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమి ష నర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్‌కు మా ర్, గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కం డ్లగుంట మధుబాబు నాయుడు, గుంటు పల్లి రాజ కుమార్‌చౌదరి, శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ లోని ఎల్సీ గేట్లు 144, 143ల వద్ద రైల్వే, ప్రైవేట్ స్థలాలను గురువారం సౌత్‌సెంట్రల్ రైల్వే సీని య ర్ డివిజనల్ ఇంజినీరు కే.డీ.ఎస్ కృష్ణతో ఎమ్మెల్యే దగుమాటి కిష్టారెడ్డి పరిశీలించారు. చిరువ్యాపా రులకు ఇబ్బందికలుగ కుండా, అధిక వ్యయం లే కుండా నిర్మాణం ఉండాలన్న ఆలోచనలు చేశారు. రైల్వే, ప్రైవేట్ భూముల వివరాళాలను మండల త హసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏవో గోవిందరావు, కార్యదర్శి జహీర్‌భాషాలు ఎమ్మె ల్యేకి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్య క్షుడు ఎన్‌ఎస్‌యాదవ్, స్థానిక టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, కే.వెంక టేశ్వర్లురెడ్డి, డి.అంజయ్య మాధవరావు, అర్పుత్‌రాజ్, ప్రభాకర్ ఉన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

కావలి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రైల్వేక్రాసింగ్ గేట్ సమీపంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల ఆటల పోటీలను రూరల్ ఎస్‌ఐ తిరుమల రెడ్డి ప్రారంభించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు అధ్యక్షతన ఈ పోటీలు జరిగాయి. ఈనెల 15న షాదీమంజిల్‌లో జరిగే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారని మండవ వెంకట్రావు తెలిపారు. సామాజిక కార్యకర్త నటరాజ్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ దివ్యాంగుల విభాగం నేత వేణు, వేదిక నేతలు సోమయ్య, మహబూబ్‌బాష పాల్గొన్నారు.



ఘనంగా గంధ మహోత్సవం

అనంతసాగరం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గుంతబజారులో ఉన్న హజరత్ నాగూర్ షరీఫ్ నిషానీ దర్గా వద్ద గురువారం గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గంధాన్ని మేళతాళాలతో గ్రామంలో ఊరే గిం చి అనంతరం దర్గాకు చేర్చి ఫాతేహా అనంత రం భక్తులకు అందించారు .

ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలి

కలువాయి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కించపరుస్తూ మాట్లాడిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరావు వెంటనే హిం దూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని కలు వాయి హిందూధర్మ పరిరక్షణ సమితి, సమర సతసేవా ఫౌండేషన్ సభ్యులు చల్లా విజయ భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, కొండారెడ్డి, మ ల్లికార్జున, రామచంద్రయ్య చిన్నయ్య, మహేష్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీలు నిర్వహించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నెలకోసారైనా క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వ హించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూ చించారు. గురువారం పట్టణ నార్త్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాలకేశవులు, హెచ్ ఎం సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, సలీం, సందా నీబేగం పాల్గొన్నారు.

2న మెగా టాలెంట్ టెస్ట్

వింజమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో 10వ తరగతి విద్యా ర్థులకు మెగా టాలెంట్ టెస్ట్ ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నట్లు ఆపస్ రాష్ట్ర కార్యదర్శి వెంగయ్య తెలిపారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మా ట్లాడుతూ స్థానిక వైఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మార్చి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తిచేయాలి

అల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మార్చి నెలాఖరులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని అలా చేయని వారి బిల్లు లు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక దయాకర్‌రెడ్డి లే అవుట్‌తో పాటు నార్తుమోపూరు లేఅవుట్ ను పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకోలేని లబ్ది దారులు కాంట్రాక్టర్లతో నిర్మించేలా చర్య తీ సుకోవాలని అధికారులను ఆదేశించారు. కా ర్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సురేష్, మాధవరావు ఉన్నారు.

లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలి

కలిగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న కావలిలో జరిగే జాతీయ మె గా లోక్‌అదాలత్ సేవలను సద్వియోగం చే సుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు మాల కొండారెడ్డి తెలిపారు. ఈ విషయంపై గురు వారం ఆయన మాట్లాడారు. కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులు, ఖర్చు, కాలయా పన, అప్పీల్ లేని అంతిమ తీర్పులు లోక్ అ దాలత్‌లో ఇవ్వడం జరుగుతుందన్నారు. కా వలి న్యాయస్థానాల పరిధిలోని, న్యాయ మూర్తుల ఆధ్వర్యంలో జరిగే లోక్ అదాల త్‌తో కక్షిదారులకు సత్వరన్యాయం జరుగు తుందని కలిగిరి, కొండాపురం, జలదంకి, కా వలి, బోగోలు మండలాల ప్రజలు వినియో గించు కోవాలని కోరారు.

చెంచయ్యకు నివాళి

వలేటివారిపాలెం, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): స్థానిక టీడీపీ సీనియర్ నాయకు లు కుంబాల చెంచయ్య దశదినఖర్మకు గు రువారం ఆంధ్రప్రదేశ్ టూరిజం చైర్మన్ డా క్టర్ నూకసాని బాలాజీ హాజరైయ్యారు. ఈ సందర్భంగా చెంచయ్య చిత్రపటానికి నివా ళులర్పించి పార్టీకి చేసిన సేవలను కొని యాడారు. చెంచయ్య తనయుడు అంజయ్య తో పాటు కుటుంబసభ్యులకు ప్రగాఢ సం తాపం తెలిపారు. ఆయన వెంట పరిటాల బాస్కర్‌రావు, గుత్తా కొండయ్య, చెన్నిబోయి న ఓబులు కొండయ్య, పొట్టేళ్ల అంజయ్య, కా కుమాను ఆంజనేయులు, ప్రెగడ నరసిం హం, సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు బ్యాచ్‌లకు శిక్షణ

వలేటివారిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం నుంచి 19వ తేదీ వర కూ రెండు బ్యాచ్‌లకు రెండురోజులపాటు శి క్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎం పీడీఓ నరేంద్రదేవ్ గురువారం ఒక ప్రక టనలో తెలిపారు. అన్ని సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసి స్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వీఆర్వో లకు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, సర్పంచ్‌లకు, ఎనర్జీ అసిస్టెంట్లు 67 మంది పాల్గొంటారని పేర్కొన్నారు.

మాలల మహాగర్జనను విజయవంతం చేయండి

అల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15న గుంటూరులో చేపడుతున్న మాలల మహా గర్జనను విజయవంతం చేయాలని అంబే ద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు. స్థానిక స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన చలో గుంటూరు కార్యక్రమానికి సంబం దించిన గోడపత్రికను దళిత నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయి లో అమలైతే మాలల పరిస్థితి దుర్భరంగా మారుతుందని దీనిపై తీవ్ర పోరాటాన్ని చే యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దా నం మాల్యాద్రి, గాలి వేణుగోపాల్, సతీ ష్కఉమార్, నరేష్ పాల్గొన్నారు.

చిల్లచెట్లు తొలగింపు

లింగసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ సమీపం నుంచి బ్రిడ్జి రోడ్డు మీదుగా అతి థిగృహానికి, ప్రాజెక్టు కార్యాలయాలకు వెళ్లే రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లను అధికారులు తొలగింపజేశారు. చెట్లు తొలగించడంతో గ్రా మాల ప్రజలు, ప్రాజెక్టు సందర్శకులు సం తోషం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే ఏఆర్టీ తనిఖీ

బిట్రగుంట, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని ఏఆర్టీ (యా క్సిడెంట్ రిలీఫ్ ట్రైన్)ని విజ యవాడ రైల్వే సహాయక డివిజనల్ మేనే జర్ హనూక్ గురువారం తనిఖీ చేశారు. మొదట స్టేషన్ మా స్టర్ కార్యాలయంకు చేరుకున్నారు. అనంతరం ఏఆర్టీలో ప్రస్తు తం ఉన్న వసతుల వివరాలను అధికా రులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది సమస్యలపై చర్చించారు.

నిఘా నీడలో మనుబోలు

● త్వరలో 20 సీసీ కెమెరాల ఏర్పాటు

మనుబోలు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇకపై మనుబోలు నిఘానీడలోకి వెళ్లనుంది. పట్టణమంతా సీసీ కెమెరాల మ యం కానుంది. ప్రధాన రహదారిపై ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగి నా పోలీసులు ఠాణాలో కూర్చుని ఇట్టే పసిగట్టేస్తారు. పగలైనా, రాత్రియి నా నేరస్థులను గుర్తించగలిగే కెమెరాలను అమర్చనున్నారు. జిల్లా పోలీ సు ఉన్నతాధికారుల ఆదేశాలతో సీసీ కెమెరాల ఏర్పాటు చేయను న్నారు. ఇందులో గ్రామస్థులను భాగస్వామ్యం చేయాలన్న ఆదేశాలతో రెండునెలలుగా సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీసులు దృష్టిపెట్టారు.

● నిందితులను పట్టుకునేందుకే..

గతంలో అనేకసార్లు వరుస దొంగతనాలు జరిగాయి. అయినా నిం దితుల జాడ కనుగొనేందుకు వీలుకాలేదు. దీనిపై పోలీసుఉన్నతాధికారు లు విరివిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో ఎస్‌ఐ. శివరాకేష్ రెండునెలలుగా శ్రమించారు. వ్యాపారులను సమావేశప రిచి సీసీకెమెరాల అవసరంపై అవగాహన కల్పించారు. విరాళాలు ఇవ్వా లని కోరారు. ఈ క్రమంలో 20 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధం చేశారు. మొత్తం మీద ఇటు మనుబోలు గ్రామంలోనూ, ఇటు హైవేపైనా సీసీ కెమెరాల నిఘా ఉండబోతుంది.



కరెంటు స్తంభానికి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు

రోగులకు మెరుగైన సేవలందేలా కృషి చేయండి

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ● జీజీహెచ్ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన కమిటీ సభ్యులతో నేతలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అం దేలా కృషి చేయాలని జీజీహెచ్ అభివృద్ధి కమిటీకి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశా లలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మడపర్తి శ్రీనివాసులు కో ఆర్డినేటర్ గా, బోడే వీరబ్రహ్మారెడ్డి, అబీదా సుల్తానా, మొగరాల సురేష్, దారా మల్లికార్జున సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే కోటంరె డ్డి నూతన కమిటీ సభ్యులకు శాలువా వేసి సత్కరించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న అన్ని రకాల వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నప రెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి ఉన్న బాధ్యతలను సకాలంలో వినియోగిం చాలన్నారు. అనంతరం అభివృద్ధి కమిటీ సభ్యులు అబీదా సుల్తానాను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్, క్లస్టర్ ఇంచార్జి గంగాధర్, అస్లాంలు, మడపర్తి శ్రీనివాసులు, దారా మల్లికార్జునను ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మమతా రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నేత చిత్తలూరు సుందరరామి రెడ్డి, జలదంకి సుధాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నీళ్లలో వారం నిల్వ ఉంటే నారు దెబ్బతింటుంది

జహీర్, మనుబోలు మండల వ్యవసాయాధికారి



మనుబోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వారం రోజులు వరి నారు నీటిలో నాని తే, పాచిపోయి పనికిరాకుండా పో తుందని మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు.

? : ఈ వర్షాలకు వరి పైరుకు నష్టమా...

! : వరి నీటిలో పెరిగే మొక్క. కురుస్తు న్న వర్షాలకు ఎలాంటి నష్టం లేదు. తుఫా న్లు వచ్చి, ఎక్కువరోజులు నీరు నిల్వఉంటే నష్టం కలుగుతుంది.

ముఖాముఖి

? : ఎమ్మార్పీకే ఎరువుల విక్రయాల పై తనిఖీలు.

! : ఇటీవల ఏడీ తనిఖీలు చేశారు. దుకాణాల వద్ద ధరల బోర్డులు పెట్టాలని సూచిం చాం. రైతుసేవా కేంద్రాల ద్వా రా ముందస్తుగా డబ్బులు చె ల్లిస్తే ఎరువులు అందిస్తాం.

? : పొలం పిలుస్తోందిపై రైతులు ఏమంటున్నారు

! : ఈ కార్యక్రమాన్ని మంగ ళ,బుధ వారాల్లో నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థా యిలో రైతు లదగ్గరకి వెళుతున్నాం. రైతులు మంచి అభి ప్రాయాలు చెపుతున్నారు.

? : ఆర్‌బీకేల పేరు ఎందుకు మార్చ లేదు.

! : ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాలేదు. రాగానే రైతుసేవా కేంద్రాలుగా మారుస్తాం.

సుస్థిరాభివృద్ధి సాధనలో సర్పంచులే కీలకం


బుచ్చిలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విద్యారమ



మనుబోలులో మాట్లాడుతున్న ఎమ్పీడీవో జలజాక్షి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలు సుస్థిరాభి వృద్ధి సాధించడంలో సర్పంచులు, కా ర్యదర్శులు, సచివాలయ సిబ్బంది కీలకపాత్ర పోషించాలని జడ్పీ సీఈవో విద్యారమ అన్నారు. బుచ్చి ఎంపీపీ కార్యాలయంలో గురు వారం ఎంపీడీవో అధ్యక్షతన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై మొదటి బ్యాచ్‌కి శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యతను వివరించారు. ముందుగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటా లకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో రెండురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గు రువారం ముగిశాయి. ఈ శిక్షణలో ఎంపీడీవో జలజాక్షి మాట్లాడుతూ పంచాయతీల్లో సుస్థిర ఆదాయ వన రుల కోసం ప్రభుత్వం నిర్దేశించిన 9అంశాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఈవోపీఆర్‌డీ నారాయణ, ఏఈలు కసనానాయక్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శి క్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్) రాష్ట్ర పరిశీలకుడు రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా ల్లో నివసిస్తున్న ప్రజల జీవన ప్రమాణాలతో పాటు వారి ఆర్థిక పరి స్థితిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎంపీడీవోటి భవానీ మాట్లాడుతూ అధికారు లు గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె ప్రసన్న పాల్గొన్నారు.

విరాళం

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని అ న్న క్యాంటీన్ల నిర్వహణ కోసం నగరానికి చెందిన విశ్రాంత ఏఎస్‌డబ్ల్యువో షేక్ కాశిం గురువారం రూ.5వేల విరాళం చెక్కును నగరపాలక సంస్థ కార్యాలయంలో అందజేశారు.

15న గుంటూరులో మహాగర్జన

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు12: మాల సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో జ రగనున్న మహాగర్జనను విజయవంతం చేయాలని దళిత సంఘాల నా యకులు పిలుపునిచ్చారు. గురువారం బుచ్చిలో నిర్వహించిన సమావేశం లో పలువురు నాయకులు మాట్లాడారు. ఈనెల 15న గుంటూరు జిల్లా న ల్లపాడు వద్ద జరగనున్న మహా గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ముందుగా వారు మహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమా వేశంలో దళిత నాయకులు బీవీ.రమణయ్య, బీ విల్సన్, తిరుపాల్, మల్లికా ర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నావూరుపల్లి వాగు పరిశీలన

పొదలకూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో నిర్లక్ష్యా నికి గురైన మండలంలోని నావూరుపల్లి వాగును గురువారం జనసేన నా యకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ సమన్వ యకర్త బీ సురేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలోని ఆల్తుర్తి, నా వూరుపల్లి మధ్య వర్షాలు వస్తే ఈ వాగువల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా, గత ప్రభుత్వం, సొంత మండలం అని చెప్పుకునే మాజీ మంత్రి కాకాణి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. కూటమి ప్రభు త్వం త్వరలోనే వంతెన నిర్మించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్ర మంలో జనసేన నాయకులు అనీల్, నారదాసు, రవి, మందపల్లి ప్రవీణ్, బండి మనోజ్, కొమ్మల ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ కర్ర తరలిస్తున్న వాహనం పట్టివేత


పట్టుబడిన వాహనం

రాపూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా జామాయిల్ చెట్లను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ సిబ్బంది గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. కాగా, అటవీశాఖ అధికారుల కళ్లుగప్పి డ్రైవర్ పరారయ్యాడని మండల అటవీ క్షేత్రాధికారి రవీంద్రబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ


మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు రమేష్

సైదాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో గురువారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకుడు ఏ రమేష్ మాట్లాడుతూ అధికా రులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పం చాయతీల అభివృద్ధికి దోహదపడాలన్నారు. గ్రామాల్లో సమస్యలను అధికా రులు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం, శివకుమార్, ఈవోపీఆర్‌డీ జిలానీబేగ్, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరురూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యో తి): నగరంలోని 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ లో రూ.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరో డ్లు, కల్వర్టుల నిర్మాణాలకు నెల్లూరురూరల్ ఎ మ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం శంకు స్థాపన చేశారు.అనంతరం ఆయన మాట్లాడు తూ ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామిలన్నీ టిని ఒక్కొకటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

పాతనేరస్థుడి దాడిలో ఒకరికి గాయాలు

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై పాతనేరస్థుడు కత్తితో దాడి చే సిన ఘటన గురువారం రాత్రి డైకాస్‌రోడ్డు సమీపంలోని గ్రీన్‌పార్క్ బార్, రెస్టారెంట్‌లో జరిగింది. వివరాల మేరకు... నగరంలోని డైకాస్ రోడ్డు ఎస్‌టీ టీ కాలనీకి చెందిన కరిముల్లా ఆటో పెయింట్ పనులు చేసుకుంటూ జీవి స్తున్నాడు. గురువారం రాత్రి ఆయన గ్రీన్‌పార్క్ బార్, రెస్టారెంట్ వద్ద ఉ ండగా అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్థుడు యాసీర్ అక్కడకు వచ్చా డు. వారి ఇద్దరి మధ్య ఏమి జరిగిందో కానీ యాసీర్ కత్తితో కరిముల్లాపై దాడి చేసి పరారైనట్లు స్థానికులు తెలిపారు. తీవ్రగాయాలపాలైన కరిము ల్లాను స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దాడికి గల కారణాలు తెలి యాల్సి ఉంది. యాసీర్‌పై ఇప్పటికే కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

ఇంజనీరింగ్ అధికారులకు షోకాజు నోటీసులు

● నిర్లక్ష్యానికి లిఖితపూర్వక వివరణ కోరిన కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నె ల్లూరు నగరాన్ని సుందరీకరించడాన్ని ప్రయోగాత్మ కంగా తీసుకుని రాష్ట్రమంతట అమలు చేయాలన్న లక్ష్యంతో పురపాలక శాఖ పనిచేస్తుండగా ఇక్కడ అ ధికారులు మాత్రం నిలువెత్తు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తు న్నారు. డివైడర్లలో మొక్కలు నాటేందుకు నాశిరకం మట్టిని వాడుతున్నారంటూ తప్పుపట్టిన కమిషనర్ సూర్యతేజ దానిని వెంటనే తొలగించి నాణ్యమైన మ ట్టిని వేయాలని ఇంజనీరింగ్ అధికారులను సోమవా రం ఆదేశించారు. కానీ అదే మట్టిని డివైడర్లలో చదు ను చేసేశారు. ఈ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ ఆంధ్ర జ్యోతి గురువారం ప్రత్యేక శీర్షికను వెలుగులోకి తీసు కువచ్చింది. దీనిపై స్పందించిన కమిషనర్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆక్షేపిస్తూ ఇంజనీరింగ్ ఎస్‌ఈ రామ్మోహన్ రావు, ఉద్యాన అధికారి ప్రదీప్, ఈఈ అశోహరి శేషగి రిలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. లిఖిత పూ ర్వకంగా తనకు వివరణ ఇవ్వాలంటూ కమిషనర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రూ. కోట్లను ఖర్చు చేసి నగ రవాసులకు ఆహ్లాదం, పచ్చదనం దగ్గర చేయాలని ప్రభుత్వం సుందరీకరణ పనులు శరవేగంగా చేస్తుం ది. కానీ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా, ని ర్లక్ష్యంగా కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పనిచేస్తుం డటం కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నెల్లూరు (క్రైం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల నడుమ విబేధాల నేపథ్యంలో ఓ వివా హిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై చి న్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చే శారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని జనా ర్దనరెడ్డి కాలనీకి చెందిన పర్వీన్‌కు కోటమిట్టకు చెంది న కాలేషాతో పదిహేనేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాలేషా ఆటో నడుపుకుంటూ, బిరియానీ మాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే గత కొంతకాలంగా దంపతుల నడుమ విబేధాలు నెలకొ న్నాయి. ఈ క్రమంలో పర్వీన్ తన పిల్లలను తీసుకొని ఈనెల 9వ తేదీ జనార్దనరెడ్డి కాలనీలోని పుట్టింటికి వెళ్లింది. 10వ తేదీ కాలేషా అక్కడకు వెళ్లి భార్యను ఇంటికి రమ్మని కోరగా ఆమె రానని చెప్పడంతో ఆ మెపై దాడి చేశాడు. అడ్డువచ్చిన ఆమె తండ్రిపై కూ డా దాడి చేసి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం కాలే షా తన పక్కింటి వారిని తీసుకుని వచ్చి మధ్యవ ర్తిత్వం చేసి భార్య, పిల్లలను ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ పర్వీన్ తన ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం కు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన భర్త, అ త్తమామలు ఆమెను చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పర్వీన్ తండ్రి ఖాదర్‌బాషా గురువారం చిన్నబజారు పోలీసులకు ఫి ర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బయ్య

మనుబోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లపూడి, వీరంపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు వడ్లపూడిలో, తరువాత వీరంపల్లిలో సదస్సు నిర్వహించారు. వడ్లపూడిలో ఏడు, వీరంపల్లిలో 11 అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి 45రోజుల్లో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో వడ్లపూడి సర్పంచు వల్లేటి రమాదేవి, టీడీపీ నాయకులు ధనెంకుల రఘురామానాయుడు, వీఆర్‌వోలు మురళీధర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి మేయర్ పరామర్శ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో గాయపడ్డ ఎన్ఎంసీ కార్మికుడు పెంచలయ్యను మేయర్ స్రవంతి గురువారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ఆమె కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారులతో మాట్లాడి వైద్య సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు.

విజయవాడకు తరలిన

మెప్మా మహిళలు



నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శుక్రవారం ము ఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగనున్న స్వర్ణాంధ్ర-2047 స మావేశానికి నెల్లూరు నుంచి మెప్మాకు చెం దిన పొదుపు సంఘాల మహిళలు గురువా రం తరలి వెళ్లారు. మెప్మా పీడీ ఏ.రాధమ్మ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయించి 40 మంది మహిళ లను పంపించారు.

శిథిలావస్థలో పోలీసు గృహాలు

● కిటికీలు, తలుపులు, నాపరాళ్ల మాయం


అడవిలా మారి శిథిలావస్థకు చేరిన పోలీసు నివాసాలు

వెంకటాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వ హించే చోటే నివాసాలు ఉండా లన్న నిబంధన మేరకు, గతం లో పోలీసుల కోసం ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి నివా సాలను ఏర్పాటు చేసింది. అయి తే వాటిని వినియోగించుకోకపో వడంతో నేడు అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వెంకటాచలం స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసుల కోసం గతంలో ప్రభు త్వం సర్వేపల్లి రోడ్డు కూడలిలో 10 క్వార్టర్లను నిర్మించింది. కొత్తవి కావడంతో సిబ్బంది కొన్నేళ్లపాటు వాటిలో నివసించారు. కాలక్రమంలో సిబ్బంది వాటిలో నివాసముండ కపోయేసరికి అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అంతేకాక స్థానికులు కొందరు ఇళ్ల కిటికీలు, తలుపులను ఊడదీసుకుని వెళ్లారు. మరి కొందరైతే గదుల్లో పరిచి ఉన్న నాపరాళ్లను సైతం మాయం చేశారు. దీంతో ఆ గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం ముళ్ల చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. క్వార్టర్లకు మరమ్మతులు చేయించి, నీటి వసతి కల్పిస్తే సిబ్బంది నివాసాలు ఉండే అవకాశం ఉంది. ఇకపోతే గ్రామంలో పోలీసు శాఖకు మరిన్ని స్థలాలు ఉన్నాయి. అయితే స్థానికులు వాటిని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకుంటున్నారు. కావున ఆ స్థలాల ఆక్రమణలను అధికారులు అడ్డుకోవడమో, లేక ఆ స్థలాలను పంచాయతీకి అప్పగిం చడమో చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ స్థలాల పట్ల శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు ఎంవీపాలెం సాగునీటి సంఘం ఎన్నిక

తోటపల్లిగూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర్లవారిపాలెం సాగునీటి సంఘం ఎన్నిక శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు, స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధి కారి కేవీ వెంకటేశ్వరరావు తెలిపారు. గురు వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సాగునీటి సంఘంలో 12 ప్రాదేశిక సం ఘాలకు సభ్యుల ఎంపిక, ఆ తర్వాత చైర్మ న్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నట్లు చెప్పా రు. 12 సెగ్మెంట్లకుగాను 3493 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి


తోటపల్లిగూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీవో కేవీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీపీ కార్యాల యంలో రెండు రోజులపాటు జరిగిన సు స్థిరాభివృద్ధిపై శిక్షణ గురువారం పూర్తయిం ది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలను సర్వతోముఖంగా అభివృద్ధి ప థంలో నడిపించేందుకు ఈ శిక్షణ ఇచ్చిన ట్లు తెలిపారు. శిక్షణలో పంచాయతీ కార్య దర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెముకుల రమణయ్యకు నివాళి

విడవలూరు,డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): విడవలూరు గ్రామాభివృద్ధికి కృషి చేసి న చెముకుల రమణయ్య వర్ధంతి ని గురు వారం గ్రామంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సా మాజిక ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు చెముకుల సుధాకర్ మాట్లాడుతూ యాభైఏళ్ల కిందటే గ్రామంలో వెనుబడిన తరగతులు, దళితు ల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిర స్మరణీయమన్నారు. ఘర్షణలను నివారిం చేందుకు విడవలూరులో శాంతి కమిటీని ఏర్పాటుచేశారన్నారు.

గిరిజనులతో ముఖాముఖి

ఇందుకూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదెమ్మస త్రంలో గురువారం ఏఆర్‌డీ స్వచ్ఛంద సం స్థ సభ్యులు శ్రీనివాసులు, కోటేశ్వరి స్థానిక గిరిజనులు, సచివాలయ సిబ్బందితో ము ఖాముఖి నిర్వహించారు. వారు మాట్లాడు తూ గిరిజనుల సమస్యలను తమ సంస్థ ఆధ్వర్యంలో పరిష్కారిస్తామన్నారు. ఆధా ర్‌కార్డు లేని వారికి ఆధార్‌కార్డు ఇప్పించ డం, వృద్ధాప్య పింఛను లేని వారికి పింఛ న్లు మంజూరు చేయించడం, రేషన్‌కార్డులు లేని వారికి కార్డు ఇప్పించేలా ప్రయత్నం చేయడం తదితర కార్యక్రమాలు చేస్తున్నా మని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, టీడీపీ నాయకులు కే.వెంకటేశ్వర్లురెడ్డి, మల్లికార్జుననాయుడు, పలువురు గిరిజను లు, తదితరులు పాల్గొన్నారు.





- ఉధృతంగా పారుతున్న స్వర్ణముఖి, కాళంగి, కైవల్య నదులు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- అనేక మార్గాల్లో రాకపోకలు బంద్
- నిండుకుండల్లా మారిన రిజర్వాయర్లు
- తెగిపోయే స్థితిలో పలు చెరువులు

పుత్తూరు మండలం పైడిపల్లి కాజ్‌వేపై ఉధృతంగా ప్రవాహం

నేడు కూడా వానలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో శుక్రవారం కూడా వానలు కురుస్తాయి. జిల్లాలో చాలాచోట్ల వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ గురువారం హెచ్చరించారు. అధికారులు వాగులు, చెరువులు, వంకలను పరిశీలించి ఎప్పటికప్పుడు కరకట్టలను సరిచేయాలన్నారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తుంటే వాహన రాకపోకలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. విపత్కర పరిస్థితి ఉంటే ప్రజలు కంట్రోల్ రూంలకు ఫోన్ చేయాలని కోరారు.

తిరుపతి కలెక్టరేట్ : 0877-2236007
తిరుపతి ఆర్డీవో ఆఫీసు: 7032157040
గూడూరు సబ్‌కలెక్టర్ ఆఫీసు: 9849904062
సూళ్లూరుపేట ఆర్డీవో ఆఫీసు: 9441984020
శ్రీకాళహస్తి 6281156474



కేవీబీపురం మండలం రాజుల కండ్రిగ వద్ద అవస్థలు

రేణిగుంట బాలాజీ కాలనీ వాసుల అవస్థలు

విడవని వాన

మళ్లీ వానలు విరుచుకుపడ్డాయి.
నదులు నిండుగా పారుతున్నాయి. వాగులు పొంగుతున్నాయి. చెరువులు తెగిపోయే స్థితికి చేరుకున్నాయి. బుధవారం రాత్రి నుంచీ కురిసినట్లే ఇంకొక్క రోజు గనుక వానలు కొనసాగితే జిల్లా అతలాకుతలం అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే జిల్లాలో అనేక మార్గాల్లో రాకపోకలు ఆగిపోయాయి. 12 మార్గాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేశారు. తిరుమల కనుమ దారిలో కొండచరియలు విరిగి పడ్డాయి. గురువారం బడులకు వెళ్లాక సెలవు ప్రకటించడంతో జోరు వానలో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. వానలు కురుస్తున్నా జిల్లావ్యాప్తంగా రెవిన్యూ సదస్సులు నిర్వహించారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

బీఎన్ కండ్రిగలో నీటమునిగిన వరి

నీట మునిగిన పంటలు

పెళ్ళకూరులో పంటపొలాలు నీట మునిగాయి. ఏర్పేడు మండలంలో వానలకు చిందేపల్లిలో వరినాట్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. నాయుడుపేట మండలంలోనూ అదే పరిస్థితి. ముఖ్యంగా పుదూరు గ్రామంలో బాగా దెబ్బతిన్నాయి.

బీఎన్ కండ్రిగలో 16.2 సెంటీమీటర్ల వాన

జిల్లాలో గురువారం సాయంత్రం 5 గంటల వరకూ 78 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే బీఎన్ కండ్రిగలో అత్యధికంగా 162.6, డక్కిలిలో 136.4, బాలాయపల్లిలో 117.4, సూళ్ళూరుపేటలో 117, వరదయ్యపాలెంలో 109.8, తడలో 107.4, కేవీబీపురంలో 104.2, వెంకటగిరిలో 97.2, పుత్తూరులో 91.8, శ్రీకాళహస్తిలో 91.4, తొట్టంబేడులో 91 మిల్లీమీటర్లు చొప్పున భారీగా వర్షపాతం నమోదైంది. చిల్లకూరులో అత్యల్పంగా 26.4 మిల్లీమీటర్ల వాన కురిసింది.



తిరుపతి ఎస్టీవీనగర్

జలకళలాడుతున్న రిజర్వాయర్లు

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతోంది. బ్యారేజీ నుంచీ 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేవీబీపురం మండలంలో కాళంగి రిజర్వాయర్ పది గేట్లు ఉదయం పది గంటలకే ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు. రేణిగుంట మండలం మల్లిమడుగు రిజర్వాయర్‌లోకి నీరు వస్తోంది. నాలుగు గేట్లు స్వల్పంగా ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. పిచ్చాటూరు మండలంలో అరణియార్ గేట్లు ఎత్తివేసి వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్‌లోకి నీరు చేరుతోంది.



పరవళ్ళు తొక్కుతున్న కాళంగి



మల్లిమడుగు దూకుడు

ప్రమాదకర స్థితిలో చెరువులు

సూళ్లూరుపేటలో భారీ వర్షం కురుస్తుండడంతో గురువారం రాత్రికి కాళంగి నది, పాముల కాలువ పొంగే ప్రమాదం వుంది. దీంతో అధికారులు ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తడ మండలం కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు చెరువులకు ప్రమాదం పొంచి వుంది. పెళ్ళకూరు మండలంలో కూడా పలు చెరువులు ప్రమాకర స్థితికి చేరుకున్నాయి. నాయుడుపేట మండలంలో ఇప్పటికే అన్ని చెరువులూ నిండిపోగా గురువారం రాత్రి కూడా వాన కొనసాగితే పలు చెరువులు తెగిపోయే ప్రమాదం వుంది. బీఎన్ కండ్రిగ మండలంలో కంచన పుత్తూరు చెరువు ప్రమాదకరంగా మారింది. వడమాలపేట మండలం పాదిరేడు చిన్న చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరింది.

నిండుగా నదులు..పొంగుతున్న వాగులు

జిల్లాలో స్వర్ణముఖి, కాళంగి, కైవల్య నదులు నిండుగా పారుతున్నాయి. శ్రీకాళహస్తిని ఒరుసుకుంటూ స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఇదే నది పెళ్లకూరు మండలంలో పోటెత్తి దూకుతోంది. వెంకటగిరిలో కైవల్య నది ఉధృతంగా ఉంది. సూళ్లూరుపేటలో కాళంగి ఉధృతి పెరిగింది. నాయుడుపేటలో మామిడి కాలువ పొంగింది. జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో 43 బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు.



తడ వద్ద నదిలా జాతీయ రహదారి

- కేవీబీపురం మండలంలో పూడి ప్రాంత గ్రామాలకు వెళ్లే వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. రేణిగుంట మండలం గాజులమండ్యం-కల్లూరు మార్గంలో కల్లూరు కాలువ, అన్నాసామిపల్లి మార్గంలో వాగు, అత్తూరు వాగు వంటివి పొంగడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు.
- బీఎన్ కండ్రిగ మండలంలో సీత కాలువ, పంది కాలువ, కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలను పూర్తిగా ఆపేశారు.
- వరదయ్యపాలెం మండలంలో గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ పొంగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి.
- శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరు గ్రామం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- స్వర్ణముఖి ప్రవాహ ఉధృతి కారణంగా శ్రీకాళహస్తి నుంచీ పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు ఆపేశారు. ఇదే మండలం ముళ్లపూడి ఎస్టీ కాలనీ, ఉడవలపాడు, ముచ్చువోలు, గంగలపూడి, ఓబులాయిపల్లి, దొమ్మరపాలెం గ్రామాల వద్ద వాగులు పొంగాయి. కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.
- తొట్టంబేడు మండలం కారాకొల్లు, చిట్టత్తూరు మార్గాల్లో కాలువలు పొంగడంతో రాకపోకలు ఆగాయి.
- వడమాలపేట మండలం నేసనూరు వద్ద వాగు పొంగడంతో రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. వడమాలపేట మండలం గూళూరు చెరువు నిండిపోయి కలుజు పారుతోంది. ● వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో ఓ కారు చిక్కుకుపోయింది.
- ఏర్పేడు మండలంలో సీత కాలువ ప్రవాహ వేగం పెరగడంతో గుడిమల్లం ఆలయానికి భక్తుల రాకపోకలను అధికారులు ఆపేశారు.



రేణిగుంట మండలం కల్లూరు వద్ద..

కలుజులో జారిపడి రైతు మృతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పొలానికి వెళుతూ కలుజు వద్ద కాలు జారిపడి రైతు శ్రీనివాసులు(60) మృతిచెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం అబ్బాబట్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. అబ్బాబట్లపల్లికి చెందిన శ్రీనివాసులు గురువారం ఇంటి నుంచి పొలానికి వెళ్లే క్రమంలో కలుజు వద్ద నీటిలో పడటంతో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. కుటుంబ సభ్యులు ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు.





తిరుపతి పద్మావతి కళ్యాణ మండపాల వద్ద కాలువలా మారిన రోడ్డు

పేర్నాడు రోడ్డు కోతను పూడ్చిన గ్రామస్తులు

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న పల్లెలకు వెళ్లే కొరిడి-పేర్నాడు రోడ్డు కోతకు గురైంది. అలల ఉధృతికి ఈ రోడ్డు అట్టకానితిప్పకు 2 కిలోమీటర్ల సమీపంలో కోతకు గురైంది. ఆర్టీసీ బస్సును రద్దు చేశారు. వెంటనే గ్రామస్థులే పూనుకొని ట్రాక్టర్లతో ఇసుక బస్తాలతో కోతకు గురైన రోడ్డును పూడ్చి మరమ్మతులు చేశారు.





చెరువులా మారిన తిరుపతి బస్టాండు

ప్రపంచ చెస్ ఛాంపియన్

గుకేష్ మనవాడే

చెంచురాజు కండ్రిగలో సంబరాలు

పిచ్చాటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్ల వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుని చరిత్ర సృష్టించిన యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజు పూర్వీకులది తిరుపతి జిల్లా కావడం విశేషం. పిచ్చాటూరు మండలంలోని చెంచురాజు కండ్రిగకు చెందిన భూస్వామి శంకర్‌రాజు మనవడే గుకేష్. రైల్వే ఉద్యోగిగా చెన్నై తరలివెళ్లిన శంకర్‌రాజు కొడుకైన రజనీకాంత్ అక్కడే డాక్టర్‌గా స్థిరపడ్డారు. నగరానికే చెందిన డాక్టర్ పద్మావతిని వివాహమాడారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గుకేష్ చిన్నప్పటి నుంచీ చెస్ క్రీడపై మక్కువ పెంచుకుని ప్రతిభ చాటుతూ వచ్చాడు.శంకర్‌రాజుకు చెంచురాజు కండ్రిగలో భూములతో పాటు రైస్ మిల్ కూడా ఉండడంతో అప్పుడప్పుడూ సొంతూరికి వచ్చిపోతుంటారు. గుకేష్ ప్రపంచ చెస్ ఛాంపియన్ కావడంతో చెంచురాజుకండ్రిగ గ్రామస్తులు సంతోషంలో మునిగితేలుతున్నారు.



16 నుంచి ముక్కంటి ఆలయ దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. తెల్లవారుజాము 3 గంటలకు జేగంట, 4కు మంగళ వాయిద్యాలు, 4.15కు గోపూజ, తిరుమంజనం, 4.30కు పల్లియర పూజ(సుప్రభాతం లేదు), తేవారము ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 5కు సర్వదర్శనం, మొదటికాల అభిషేకం(సేవలు లేవు), 6కు రెండో కాలాభిషేకం, 7కు పరివార దేవతా నైవేద్యం, 7.30కు గొబ్బెమ్మవార్ల ఉత్సవం, 10.30కు మూడవ కాలాభిషేకం(ఉచ్చికాలం), సాయంత్రం 5కు ప్రదోష కాలాభిషేకం, శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9 గంటలకు పల్లియపూజ, దర్శనం ముగింపు. మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 9 గంటలకు పల్లియర పూజల అనంతరం దర్శనం ముగింపు ఉంటుందని ఈవో వివరించారు.

రెవెన్యూ సదస్సులకు 556 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గురువారం నిర్వహించిన 51 గ్రామసభల్లో 556 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కురుస్తున్నా సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 5,127 అర్జీలు అందాయని తెలిపారు. అందులో భూకబ్జాలు, రీసర్వే, 22ఏ, ఇంటి స్థలాలు, అసైన్‌మెంట్‌ల్యాండ్,ఆర్‌వోఆర్, క్యాస్ట్ వెరిఫికేషన్ తదితర సమస్యలపై వచ్చినట్లు తెలిపారు.

నేడు కూడా విద్యా సంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో శుక్రవారం కూడా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. దీన్ని తప్పక పాటించాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వానలోనే చక్రతీర్థ ముక్కోటి

తిరుమలలో జోరున కురుస్తున్న వానలోనే గురువారం చక్రతీర్థ ముక్కోటి జరిగింది. కార్తీక సమయంలో దీన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం వానలోనే మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుంచి చక్రతీర్థానికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ చక్రత్తాళ్వారుకు, నరసింహ స్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి



హ్యాపీ బర్త్‌డే రజనీకాంత్

ప్రసిద్ధ నటి రాధిక తిరుమల నుంచి శుక్రవారం పుట్టిన రోజు జరుపుకుంటున్న రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాధిక దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రజనీకాంత్ ఆరోగ్యంతో ఉండాలని స్వామి సన్నిధి నుంచి కోరుకుంటున్నానన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.88 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,887
తలనీలాలు సమర్పించినవారు: 25,725



గోగర్భం డ్యాం నుంచి విడుదల చేసిన నీరు


తిరుమలలో దంచికొట్టిన వాన

నిండిన జలాశయాలు

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240 (లక్షల గ్యాలన్లు)	నిండిపోయి గేట్లు ఎత్తివేత
కుమారధార	4,258	4,005
పసుపుధార	1,287	1,100
గోగర్భం	2,833	నిండిపోయి గేట్లు ఎత్తివేత
ఆకాశగంగ	685	నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతోంది

తిరుమలలో వాన ముంచిపోసింది. గురువారం వేకువజామున జల్లులతో మొదలైన అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. శ్రీవారి ఆలయం ముందు, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దర్శనానికి వెళ్లేవారూ, బయటకు వచ్చేవారూ కూడా తడిచి ముద్దయ్యారు. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, షెడ్లు, కార్యాలయాల ముందే చలికి ముడుచుకుని ఉండిపోయారు. వాన కారణంగా సాయంత్రం ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకరణ సేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆకాశగంగ గేట్లు ఎత్తిన దృశ్యం - నిండుకుండలా ఆకాశగంగ

నిండిన జలాశయాలు : తిరుమలలోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యాములు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లును ఎత్తివేయగా, ఆకాశగంగా డ్యాం నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతోంది. కుమారధార, పసుపుధార డ్యాముల్లోకి 90 శాతం నీరు చేరింది. శుక్రవారం వేకువజాముకు ఇవి కూడా నిండిపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నిల్వలతో రానున్న 350 రోజులకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు అందుబాటులోకి వచ్చింది. తిరుమల అవసరాలకు ప్రతిరోజు 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఇందులో 20 లక్షల గ్యాలన్లు తిరుమల డ్యాముల నుంచి మరో 30 లక్షల గ్యాలన్లు కల్యాణిడ్యాం నుంచి తీసుకుంటారు. గత మూడు నెల క్రితం వరకు కూడా తిరుమలలో నీటి ఇబ్బందులు వస్తాయని టీటీడీ అధికారులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంలో నీటి వినియోగంలో కొన్ని ఆంక్షలు కూడా విధించారు. అయితే తాజా వానలతో జలాశయాల్లోకి నీరునిండుగా చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పాపవినాశనం, శ్రీవారిపాదాలకు నో ఎంట్రీ

ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, ఆకాశగంగ, శ్రీవారిపాదాలు, శిలాతోరణం మార్గాలను టీటీడీ గురువారం ఉదయం మూసివేసింది. అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాలలో భక్తులు జాగ్రత్తగా వెళ్లాలంటూ విజిలెన్స్ సిబ్బంది సూచనలు చేస్తున్నారు.



రెండో ఘాట్‌లో జారిన బండ

రెండవ ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. మార్గంలోని హరిణి విశ్రాంతి షెడ్‌కు సమీపంలో ఓ భారీ బండరాయితో పాటు మట్టి, చిన్నపాటి రాళ్లు రోడ్డుమీదకు జారాయి. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజినీరింగ్ అధికారులు జారిన కొండచరియలను వేగంగా తొలగించారు. రెండు ఘాట్ రోడ్లలోనూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను మూడు బృందాలు పరవేక్షిస్తున్నాయి.



లీలామహల్ వద్ద భారీ వర్షాలతో ప్రజలకు అవసరమైన సూచనలు ఇస్తున్న డీఎస్పీ

వాగులు..వంకల వద్ద పోలీసు పహారా : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎవ్వరూ అనవసరంగా బయటకు రావద్దని, వాగులు, వంకల్లో చిక్కుకుని ఇబ్బందులు పడవద్దని ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112 లేకుంటే 8099999977కు వాట్సాప్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. అండర్ బ్రిడ్జిల కింద నిర్లక్ష్యంగా వెళ్లరాదన్నారు. తిరుపతిలో దాదాపు 12 ప్రాంతాలు జలమయమయ్యాయని, పోలీసులు దగ్గరుండి పరిస్థితులను సమీక్షిస్తున్నారని తెలిపారు. కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే చోట ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాళంగి 10 గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కాళంగి జలాశయం నిండుతోంది. జలాశయం సామర్థ్యం 240 అడుగులు కాగా ప్రస్తుతానికి 225 అడుగులు చేరింది దీంతో పది గేట్లను 8 అడుగుల చొప్పున ఎత్తి నీటిని దిగువకు వదిలినట్లు ఏఈ బాబు తెలిపారు. జలాశయంలోకి 9,200 క్యూసెక్కుల నీరు చేరుతుండగా గేట్ల ద్వారా 10,080 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రధాన గేట్ల వద్ద 198 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉందన్నారు. ఇంకా పెరిగే అవకాశముంటే మరిన్ని గేట్లు ఎత్తుతామని వివరించారు.

కొట్టుకుపోయిన వంతెన


కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజులకండ్రిగ సమీపంలో పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన వర్షాలకు కొట్టుకుపోయింది. విద్యార్థులు ప్రవాహం తక్కువగా ఉన్న సమయంలో కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాలకు, రాజులకండ్రిగలోని ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. అయితే అధికారులు స్కూళ్లకు ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో విద్యార్థులు వర్షంలోనే తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక యువకులు వారిని దగ్గరుండి ఏరు దాటించారు. ఇది గమనించిన సర్పంచు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరూ ఏరు దాటకుండా సిబ్బందిని కాపలా పెట్టారు.

ఆలస్యంగా సెలవు ప్రకటన

ఇబ్బందిపడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు

తిరుపతి(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఉదాసీనత కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. తుఫాన్ కారణంగా ఈనెల 11వ తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించలేదు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను వర్షంలో తడుస్తూనే విద్యాసంస్థలకు తీసుకెళ్లారు. తీరా అక్కడికి చేరుకున్నాక విద్యాశాఖాధికారులు సెలవు ప్రకటించారు. దీంతో తల్లిదండ్రులు మళ్లీ విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

43 ఆర్టీసీ బస్సుల రద్దు



సీబీఎస్‌లో తూములో పూడిక తొలగిస్తున్న అధికారులు

తిరుపతి (ఆర్టీసీ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో ఆర్టీసీ రవాణా స్తంభించింది. వర్షానికి ఏరులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడం, వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో 43 బస్సులను నిలిపివేశారు. తిరుమల ఘాట్ బస్సుల్లోనూ తక్కువ సంఖ్యలోనే ప్రయాణికులు కనిపించారు. సీబీఎస్‌లో నీరు పేరుకుపోవడంతో తూముల్లో పూడికతీసి బయటకు పంపే ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ రవాణా ఆగిన మార్గాలు.. బస్సులు : తిరుమల పాపవినాశనం 8, సీతకాలువ 1, ఉడమలపాడు 2, అమ్మపల్లి డ్యామ్ 1, అడవికండ్రిగచెరువు 1, కావనూరు ఏరు 1, కలవకూరుకాలువ 2, గోవర్ధనపురం 9, నారాయణవనం 12, పేర్నాడు 1, పున్నేపల్లి 1, బోయలగడ్డ 4 బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి.

దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లాలి

- ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ
- ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే
- కోడింగ్‌లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతి అందజేత





సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ - విజేతలకు చెక్కు అందిస్తున్న ఐఐటీ అధికారులు - విద్యార్థుల సంబరాలు

ఏర్పేడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి దేశం సిద్ధంగా ఉందని, ఇండియా ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లడానికి విద్యార్థులు కృషి చేయాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. ఐఐటీ తిరుపతిలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2024 ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా ఆవిష్కరణలు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయం సాధించిందని ముఖ్య అతిథి స్విమ్స్ వైస్ చాన్సలర్ ఆర్‌వీ కుమార్ అన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్‌కుమార్ గుంజు మాట్లాడుతూ విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 మోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ చేరడం గర్వకారణంగా ఉందని చెప్పారు. తిరుపతి ఐఐటీలో డిసెంబర 11 నుంచి 12 వరకు రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే జరిగింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించిన వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి దేశంలోని వివిధ ప్రతిష్ఠాత్మక కళాశాలల నుంచి 21 బృందాలు పాల్గొన్నాయి. బుధవారం ఉదయం 9.30 నుంచి గురువారం సాయంత్రం 5.30 గంటలు 36 గంటల పాటు నిరంతరాయంగా పోటీ జరిగింది.

కోడింగ్ విజేతలు వీరే..

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతిలో ఉపయోగించే విభిన్న శ్రేణి ఔషధ మొక్కలను ప్రదర్శిస్తూ వినియోగదారులకు ఇంటరాక్టివ్ ఎడ్యుకేషన్, లీనమయ్యే అనుభవాన్ని అందించే వర్చువల్ హెర్బల్ గార్డెన్‌ను సృష్టించాలని విద్యార్థుల బృందాలకు సూచించింది. ఆయుష్ రంగంలో స్టార్టప్‌ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి రిజిస్ట్రేషన్ పోర్టల్ సామర్థ్యం పారదర్శకతను మెరుగుపరచడానికి అవసరమైన ప్రణాళికలను కోడింగ్ చేయాలని విద్యార్థులకు సూచించింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన స్టాక్ స్క్వాడ్ విద్యార్థుల బృందం, ఆర్ఎంకే ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రగతి మిత్ర గ్రూప్‌నకు చెందిన విద్యార్థుల బృందం, కోడ్ క్రాఫ్ట్ విద్యార్థుల బృందం విజేతలుగా నిలిచాయి. పుణేకు చెందిన ఆర్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కార్బన్ డేటర్స్ విద్యార్థుల బృందం, మహారాష్ట్రకు చెందిన కేకే వాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థుల బృందం సంయుక్తంగా విజేతలుగా నిలిచారు.

కల్కి ఆశ్రమం నుంచి మా భూములు అప్పగించండి!

- హైకోర్టును ఆశ్రయించిన రైతులు

వరదయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాలెం మండలంలోని కల్కి ఆశ్రమం స్వాధీనంలో ఉన్న తమ భూములను అప్పగించాలంటూ పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వరదయ్యపాలెం మండలం చెదుల్లపాకం రెవిన్యూ గ్రామ పరిధిలో పులి పోలయ్య, చంద్రశేఖర్, నీలమ్మ, సలవాది రాము అనే వారికి గతంలో ప్రభుత్వం ఆరు ఎకరాల సీలింగ్ భూములను కేటాయించింది.వాటికి అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేసింది. అయితే 2008లో వీరు హైకోర్టును ఆశ్రయించి ప్రభుత్వం తమకు కేటాయించిన అసైన్‌మెంట్ భూములను కల్కి ఆశ్రమ నిర్వాహకులు ఆక్రమించుకుని ఆశ్రమంలో కలిపేసుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.తమ భూముల్ని తమకు అప్పగించాలని కోరారు. అయితే పిటిషనర్ల తరపు ఎవరూ కోర్టులో వాదించకపోవడంతో సుదీర్ఘకాలం వేచి చూసిన హైకోర్టు ఈ ఏడాది జనవరిలో ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 2008లో తాము దాఖలు చేసిన కేసును నడిపించే ఆర్థిక స్థోమత తమకు లేకపోయిందని, అందువల్ల కేసు నడపలేకపోయామని తాజాగా మరోసారి పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించి తమ భూములను తిరిగి ఇప్పించాలని వారు తాజాగా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు. రిట్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు నాలుగు వారాలకు కేసును వాయిదా వేసింది.

తిరుపతి-మదనపల్లె రోడ్డు విస్తరణ పూర్తి చేయండి

- కలెక్టర్‌కు సీఎం సూచన



సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతులు తీసుకుని తిరుపతి-మదనపల్లె రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. రేణిగుంట-కడప రోడ్డును కూడా పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే ప్రాజెక్టు భూసేకరణ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లాను బాగా అభివృద్ధి చేయాలని సూచించారు. విజయవాడలో రెండు రోజులుగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో గురువారం సీఎం పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమలను నెలకొల్పడంలో భూసేకరణలో రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్‌కు 500 ఎకరాల స్థలం వెచ్చించాలని సూచించారు. తిరుపతి నగర పరిధిలో ఐటీ పార్క్‌కు 50 ఎకరాల స్థలం కావాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది ఫేక్ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు తీసుకుంటున్నారని, అలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకునేందుకు మెడికల్ బోర్డు మార్గదర్శకాలు సవరించాలని కోరారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ ఆక్రమణలపై సీఎం ఆరా తీశారు. 22ఏ అసైన్‌మెంట్‌ల్యాండ్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతికి జిల్లాలో గుంతల్లేని రహదారులు ఉండాలని, ఇచ్చిన నిధులతో సాధ్యమైనంత త్వరగా రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలని అన్నారు. సారా, గంజాయి, అక్రమ మద్యంపైనా దృష్టి సారించాలని ఎస్పీ సుబ్బరాయుడుకు సీఎం సూచించారు.



నుజ్జునుజ్జయిన కార్లు

రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు



చంద్రగిరి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని తొండవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాదుకు చెందిన సీహెచ్ గిరిధర్ తన కుటుంబ సభ్యులతో కాణిపాకంలో వినాయకస్వామిని దర్శించుకుని కారులో తిరుపతికి బయలుదేరారు. మండలంలోని ముంగిలిపట్టుకు తిరుమలేష్, అతని స్నేహితులు తిరుపతికి చెందిన హేమంత్, లిఖిత్ కుమార్, గౌరీశంకర్, చరణ్‌కుమార్ కారులో తిరుపతి నుంచి చిత్తూరు వైపు అతివేగంగా వెళుతున్నారు. తొండవాడ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొడుతూ ఎదురుగా వాహనాలు వచ్చే రోడ్డులోకి దూసుకెళ్లింది. ఆ క్రమంలో గిరిధర్ వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సీహెచ్ గిరిధర్, కాత్యాయని, వాణి, కేవీఎస్ ప్రసాద్, డ్రైవర్ వెంకటేష్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. అదేవిధంగా ఢీకొన్న కారులోని ఐదుగురు స్నేహితులకూ గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో మజ్దూర్ యూనియన్‌కు, సంఘ్‌కు గుర్తింపు

తిరుపతి(సెంట్రల్)డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రైల్వేలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వేలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లకు గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా ఈనెల 4, 5, 6, తేదీల్లో రైల్వేలో పోలింగ్ జరిగింది. గురువారం లెక్కింపు చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో 78,434 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మజ్దూర్ యూనియన్ 32,371ఓట్లతో 47.46 శాతం, ఎంప్లాయిస్ సంఘ్ 29,266 ఓట్లతో 42.91 శాతం సాధించి అర్హత సాధించాయి. మిగిలిన డీఎంఆర్‌కేఎస్ 5,634 ఓట్లతో 8.26 శాతం, ఐఆర్ఎంయూ 286 ఓట్లతో 0.42శాతం, ఆర్ఎంయూ 654 ఓట్లతో 0.96 శాతం సాధించాయి. దీంతో ఈ మూడు సంఘాలను పరిగణనలోకి తీసుకోలేదు. గుంతకల్లు డివిజన్‌లో ఎంప్లాయిస్ సంఘ్ 243 ఓట్లతో పైచేయి సాధించింది. దీనిపై సంఘ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలి

- విజయశంకర్‌స్వామి -



మాట్లాడుతున్న అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల మాడవీధుల విస్తరణలో భాగంగా కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 22న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని మంగళం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, తొలగించిన హనుమంతుడి విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించాలని కోరుతూ పుణ్యక్షేత్రాలు తిరిగి భక్తుల సంతకాలు సేకరించి టీటీడీకి సమర్పించామన్నారు. అన్నమయ్య గృహ సాధన సమితి, జై భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డిమాండ్లపై పోరాడుతున్నామన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో నిత్య హరినామ సంకీర్తన జరగాలని, అప్పుడే పూర్తిస్థాయిలో తిరుమల పుణ్యక్షేత్రం ప్రకాశన అవుతుందన్నారు. భక్తి గీతాలు నేర్పించే గురువులకు టీటీడీ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసియోధ లోకనాథ్, ఖదిజ్ఞాసి మల్లికావల్లభ, ఖదిజ్ఞాసి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని రైతులందరికి చేర్చాలి

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు



అవార్డులు అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతి రామయ్య

తిరుపతిరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని గ్రామీణ స్థాయిలో రైతులదరికీ అందించి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ యువపరిశోధకులకు సూచించారు. వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పశు వులకు సంబంధించిన పలురకాల వ్యాధులు, వాటి నియంత్రణకు వినియోగించే మందులు, వ్యాధి నిర్ధారణ సాంకేతికత, ఆధునిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, పశుసంపద పెంపునకు కృషిచేయాలని ఆకాంక్షించారు. వెటర్నరీడీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతిఏటా వర్సిటీలో జాతీయస్థాయి సదస్సుని నిర్వహించి, దేశంలోని పశువైద్యవిద్య పరిశోధకులని గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య, కో-ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ రాజా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వాయిదా వేయండి: సీపీఎం

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుపాను వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రెవెన్యూ సదస్సులు వాయిదా వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజ జేసీ శుభం బన్సాల్‌ను కోరారు. చాలా ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయని, గతంలో నిండిపోయిన చెరువులు గండ్లు పడే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తుపాను సహాయక చర్యల నేపథ్యంలో సదస్సులు వాయిదా వేయాలని విన్నవించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అందుబాటులో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు (అర్బన్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు అందు బాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పేద ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యశిబిరంలో వైద్యుల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం బిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. క్లబ్ కమిటీ సభ్యులు గోపాల్‌రెడ్డి, మీరారెడ్డి, నవీన్‌కుమార్, రామ్మోహన్‌రావు, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

గూడూరు(అర్బన్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో గూడూరు పట్టణ, గ్రామీణ పాస్టర్స్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేచే ప్రీ క్రిస్మస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రైస్తవులకు తాను అందుబాటులో ఉంటానని.. అలాగే క్రైస్తవులందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచలి ప్రవీణ్, డాక్టర్ వి.ప్రభుదాస్, ప్రొఫెసర్ రత్నశేఖర్, చైర్మన్ డాక్టర్ కొర్నేలిస్, డేవిడ్, దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

● డ్రైవర్‌ను కాపాడిన ఆటో డ్రైవర్

నాయుడుపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లారీ అదుపుతప్పి నాయుడుపేట- చెన్నై జాతీయ రహదారి సమీపంలోని పంటపొలాల్లోకి దూసుకువెళ్లిన సంఘటన గురువారం జరిగింది. హైదరాబాదు నుంచి ఐరన్ సామాగ్రితో డ్రైవర్ సురేష్ చెన్నైకు బయలుదేరాడు. మార్గమధ్యలోని నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలో లారీ అదుపుతప్పింది. పొలాల్లోకి దూసుకెళ్లడంతో డ్రైవర్ స్పృహ కోల్పోయాడు. అదే సమయంలో ఓ ఆటో డ్రైవర్ లారీ వద్దకు చేరుకుని సురేష్‌ను తన ఆటోలో ఎక్కించుకొని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించాడు. భోజనం చేయకపోవడంతో స్పృహ కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. డ్రైవర్ సురేష్‌కు వైద్యులు చికిత్సలు అందించారు. ఆటో డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

మధ్యాహ్నానికే వెలుగు కార్యాలయానికి తాళాలు



తాళం వేసి ఉన్న వెలుగు కార్యాలయం

బాలాయపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లిలోని వెలుగు అధికారులు గురువారం మధ్యాహ్నం రెండు గంటలకే కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లి టపోయారు. అధికారుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు తాళాలు వేసి ఉండటంతో వెనుదిరిగారు. గత కొంతకాలంగా సమయ వేళలు పాటించకుండా ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోతున్నారని పలువురు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైసీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 12,(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన ఉండి సమస్యల పరిష్కార దిశగా ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు బస్సుల ఢీ : ప్రయాణికులు క్షేమం

తడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు గురువారం ఉదయం వరదయపాళెం నుంచి కార్మికులతో పరిశ్రమకు బయలుదేరింది. బస్సు బోడిలింగాలపాడు మలుపు వద్ద తిరుగుతుండగా విజయవాడకు చెందిన అయ్యప్పస్వాముల బస్సు శ్రీసిటీ బస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సు దెబ్బతింది. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పూజోత్సవం

నాయుడుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జువ్వలపాళెంలో గురువారం శ్రీ భగవాన్ అయ్యప్పస్వామి 37వ పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ భగవాన్ అయ్యప్పస్వామి సేవాసమితి అధ్యక్షుడు కొప్పోలు సుబ్రహ్మణ్యం, గ్రామపెద్దలు గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోల్తాపడిన చేపల వ్యాన్

ఓజిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాళెం జాతీయ రహదారిపై గురువారం చేపల లోడ్డుతో వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. చెన్నై నుంచి చేపల లోడ్డుతో నెల్లూరు వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

పురుగుమందు తాగి ఉద్యోగి మృతి



మృతి చెందిన రవి

చిట్టమూరు, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం సోమసముద్రం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఈదూరు రవి(40) మేనకూరులోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇంట్లో పంట పొలానికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన రవి షెడ్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో పొలం వద్ద మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు లేదు.

రోడ్డు ప్రమాదంలో తహసీల్దారుకు గాయాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహశీల్దారు ఎస్‌వీ నరసింహరావుకు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. తహశీల్దార్ కారులో సూళ్లూరుపేటకు వస్తుండగా దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కారు వెనుకవైపు బాగా దెబ్బతింది. తహశీల్దారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే ఆయన్ను మరో వాహనంలో వైద్యశాలకు తరలించారు.

అందరి సహకారంతో పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో ప్రమీలా రాణి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు మండల, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, ఎంఈవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం..!

● ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు ● పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు ● నీట మునిగిన పంటలు ● కన్నీరు పెడుతున్న రైతన్నలు



పుదూరులో నీటమునిగిన వరిపైరు



జలమయమైన అగ్రహారపేట రోడ్డు



పెళ్లకూరులో నీటమునిగిన వరి



ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది



మున్సిపల్ అధికారులతో ను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల



దొరవారిసత్రం: తనియాలి వద్ద వంతెనపై వరద నీరు



వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి



పెళ్లకూరు: చెంబాయతోపు వద్ద నీటమునిగిన వరి



గండిపడిన మోపూరు పంట కాలువ



కోట: దక్షిణ పాలెం వద్ద నీటమునిగిన వరి



లోతట్టు ప్రాంతాల నుంచి వృద్ధ మహిళను సురక్షిత ప్రాంతానికి తీసుకెళుతున్న స్థానికులు



వరద నీటిని పరిశీలిస్తున్న తహశీల్దారు శ్రీనివాసులు

నాయుడుపేట/టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. పట్టణంలోని గెరిడీవీధి, అగ్రహారపేట వీధి, విశ్వభారతి పాఠశాల వీధి, పాత వెంకటగిరి రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు, పాద చారులు అవస్థలు పడ్డారు. పంటపొలాలు నీటమునిగాయి. చెరువులన్నీ నిండిపో యాయి. దీంతో ఇన్‌చార్జి తహశీల్దారు రాజేంద్ర, స్వర్ణముఖినది, మామిడికాలువ, ప్రధాన చెరువులను పరిశీలించి మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు.

తడ: ఎడతెరపి లేని వర్షంతో తడ మండలంలో పలు వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. చెన్నై-కోల్‌కత్తా రహదారిపై సుజాత నగర్ వద్ద భారీగా వర్షపునీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని చర్యలు చేపట్టారు. వర్షంతో చెరువులు నిండుకుండలా మారాయి. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, పంటపొలాలు నీటమునిగాయి.

చిట్టమూరు: మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వరినాట్లు నీట మునిగాయి. తాడిమేడు, కోగిలి, వడ్డీకండ్రిగ ప్రాంతాల్లోని కలుజులపైన నీటి ప్రవాహం రావడంతో ఈ మార్గంలో కంప అడ్డుగా వేశారు. రొయ్యల కాలువ, బాలచంద్రారెడ్డి ఎస్టేట్ వద్ద అధికారులు పర్యటించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లరాదని తహశీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్సై చిన్న బలరామయ్య హెచ్చరించారు.

పెళ్లకూరు: మండలంలో కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖిదితో పాటు చెరువులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకే వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మళ్లీ మొదలైన వర్షాలతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఓ వైపు స్వర్ణముఖిది మరో వైపు పాలచ్చూరు కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని కలవకూరు వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌కు వరద పోటెత్తింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు ద్వారకనాథ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన కలవకూరు స్వర్ణముఖినదిపై ఉన్న చెక్‌డ్యామ్, కప్పగుంటకండ్రిగ లోలెవల్ కాజ్‌వేపై వస్తున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. కలవకూరు చెక్‌డ్యాంపై నుంచి రాకపోకలు సాగించే వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల రాకపోకలు స్థంభించాయి. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు చెక్‌డ్యామ్, లోలెవల్ కాజ్‌వేల మీదుగా రాకపోకలు సాగించొద్దని సూచించారు. మండలంలోని పలు చెరువులు ప్రమాదకరంగా మారాయి.

సూళ్లూరుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సూళ్లూరుపేటలో గురువారం తెల్లవారు జామున నుంచి కుండిపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వీడని భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎగువన కాళంగి రిజర్వాయర్ గేటు ఎత్తివేయడంతో కాళంగి నదికి భారీగా వరదనీరు చేరింది. వర్షం ఇలాగే కొనసాగితే పట్టణానికి వరదముప్పు పొంచి ఉంది. ఎలాంటి నష్టం జరగకుండా ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

డక్కిలి: తుఫాన్ ప్రభావంతో గురువారం రోజంతా ఉరవడంతో చెరువులన్నీ పూర్తిగా నిండిపోయాయి. వెలుగొండ కొండల్లో పడ్డ వర్షపు నీరు సప్లైఛానల్ నుంచి చెరువుల్లోకి వచ్చి చేరుతోంది. పలు పంట కాలువలు తెగిపోవడంతో కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహం పంట పొలాల వైపు మళ్లడంతో నాగవోలు, మిట్టపాళెం, లింగసముద్రం గ్రామాల్లో వరి నాట్లు నీట మునిగాయని రైతులు తెలిపారు. మోపూరు పంట కాలువకు గండి పడటంతో నీరంతా వృథాగా పోతోంది.

మండలంలో ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా తహశీల్దారు శ్రీనివాసులు చర్యలు తీసు కుంటున్నారు.

బాలాయపల్లి: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షంతో కైవల్యానది ఉప్పొంగడంతో మండలంలోని కడగుంట, రామాపురం, నిండలి, వాక్యం, డక్కిలి మండలంలోని దగ్గవోలుతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం వరకు నీటి ఉధృతి లేకపోవడంతో ప్రజలు కష్టంపై రాకపోకలు సాగించారు.

గూడూరు: గూడూరు పట్టణంలో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. దీంతో పాదాచారులు పలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామీణ ప్రాంతాల రోడ్లు బురదమయంగా మారాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ బడులకు అధికారులు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకు వెనుదిరిగారు. రెవెన్యూ సదస్సులకు గురువారం ఆటంకం కలిగింది. గూడూరు రూరల్ కందలిలో ఉదయం రెవెన్యూ సదస్సు ప్రారంభం కాగా.. మధ్యాహ్నం కుందకూరులో జరగాల్సిన కార్యక్రమం వర్షం కారణంగా రద్దు చేశారు. కోట మండలం కేశవరంలో సదస్సు రద్దయింది. మిగిలిన చోట్ల వర్షంలో అవస్థలు పడుతూనే అధికారులు సదస్సులు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: కైవల్యా నదిలో వరద ప్రవాహం మూడు అడుగులకు చేరడంతో ఎస్ఐ సుబ్బారావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయారు. మండలంలోని అన్ని చెరువుల్లో వరద నీరు భారీగా చేరాయి. వరి మడులు పూర్తిగా మునిగిపోయాయి.

దొరవారిసత్రం: మండలంలో గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. మండల పరిధిలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. నెర్రికాలువ, పాలకాలువ, కన్నాకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి గురువారం దొరవారిసత్రం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో పరిశీలించారు. తహశీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ అజయ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోట: మండలంలో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని రాజుపాళెం, గూడలి, దక్షిణపాలెం, గోవిందపల్లి, రంగన్నగుంట, వెంకన్నపాళెం గ్రామాల్లోని వరిపైర్లు నీటమునిగాయి.

వాకాడు: వర్షాలకు స్వర్ణముఖి బ్యారేజీకి గురువారం 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుకోవడంతో నిండుకుండను తలపిస్తుంది. స్వర్ణముఖి బ్యారేజీ నిల్వ సామర్థ్యం 0.0035 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 5 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య తెలిపారు.

వాకాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర తీరప్రాంతాల గ్రామాల్లో తీవ్రమైన చలిగాలులతోపాటు తీరప్రాంత వాసులను భయాం దోళనకు గురిచేసింది. మత్స్యకారులు సముద్రవేటకు వెళ్లకుండా తహశీల్దారు రామయ్య చర్యలు చేపట్టారు.

వెంకటగిరి: వెంకటగిరిలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పీర్లాదిపేట, మల్లమ్మగుంట, ఎన్టీఆర్ కాలనీ, కాపాంశెం, అరవపాళెం, బంగారుపేట ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. పలు ప్రాంతాల్లో వర్షాలకు మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో చేనేత మగ్గాలు నిలిచి పోయాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పట్టణంలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. టీడీపీ నేతలు పులికల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



చింతపూడి గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

బాలాయపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కయ్యూరు, సుబ్రమణ్యం గ్రామాల్లో గురువారం తహశీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామస్థుల నుంచి అధికారులు 23 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండలంలోని పలుగోడు, సూరాయపాళెం గ్రామాల్లో అధికారులు గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు తహశీల్దారు శ్రీనివాసులుకు అర్జీలు అందించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతుల భూసమస్యలు పరిష్కారమవుతున్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని చింతపూడి గ్రామంలో తహశీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉప సర్పంచ్ రాపూరు కస్తూరమ్మ, నాయకులు సిద్దులయ్యనాయుడు, శేఖర్‌నాయుడు, మురళీనాయుడు, పరుశురామ్ తదితరులు ఉన్నారు.

కోట: మండల పరిధిలోని కేశవరంలో గురువారం జరగాల్సిన రెవెన్యూ సదస్సు భారీ వర్షం కారణంగా వాయిదా వేసినట్లు తహశీల్దారు జయజయరావు తెలిపారు. జనవరి 6వ తేదీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం చెందోడులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

వాకాడు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహశీల్దారు రామయ్య అన్నారు. మండలంలోని నిడిగుర్తిలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్, సర్పంచ్ నాగరాజు, టీడీపీ నాయకులు బూదనం వెంకటరత్నం, తీపలపూడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల ప్రారంభం



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, చీరాల ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ ప్రైవేట్ వైద్యశాలను గురువారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి చీరాల ఎమ్మెల్యే ఎం.మాల కొండయ్య విచ్చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధి, డాక్టర్ మునస్వామి, డాక్టర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రుయాకు ఐఓసీ వైద్య పరికరాల వితరణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చొరవతో రుయాలో రోగుల కోసం దాదాపు రూ.10 లక్షల విలువచేసే వైద్య పరికరాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు అందించారని సూపరింటెండెంట్ రవి ప్రభు గురువారం తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, చిన్నపిల్లల విభాగాల్లో అవసరమైన వైద్య పరికరాల వివరాలను ఇటీవల కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు.





శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

మహా భారత ప్రవచనం ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మహా భారత ప్రవచనం ప్రారంభమైంది. అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమాన్ని పది రోజుల పాటు నిర్వహించనున్నారు. గురువారం ఆది పర్వాన్ని గురించి ప్రవచనకర్త జి. రమేష్‌బాబు వివరించారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

కోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో 6 రోజులపాటు జరిగిన గ్రామదేవత జాతర మహోత్సవాలు గురువారం ముగిశాయి. గ్రామదేవత చిట్టేటమ్మ, మహాలక్ష్మమ్మ, అంకమ్మ, చెంగాళమ్మ, బంగారమ్మ, పోలేరమ్మ గ్రామదేవతల జాతర ఉత్సవాలను 6 రోజులపాటు ఘనంగా నిర్వహించారు.

దాడి చేసిన కానిస్టేబుల్‌పై కేసు

చిట్టమూరు, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలోని ఓ షాపులో పని చేసే ఈదూరు శివపై కానిస్టేబుల్ చంద్ర దాడి చేసిన కేసులో చిట్టమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... శివ అనే వ్యక్తి కొత్తగుంటలో ఓ షాపులో పని చేస్తున్నాడు. నాయుడుపేట పోలీస్టేషన్‌లో పని చేసే చంద్ర ఈ నెల 9న కొత్తగుంటకు వచ్చి శివతో గొడవ పడి చేయి చేసుకున్నట్లు తెలిపారు. షాపులో ఉన్న సీసీ పుటేజ్ ఆధారంగా చిట్టమూరు పోలీసులకు శివ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ చంద్ర గతంలో చిట్టమూరులో పనిచేస్తుండగా పలు అవినీతి ఆరోపణలు రావడంతో నాయుడుపేటకు బదిలీ చేశారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

దొరవారిసత్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో గురువారం ఉదయం గంజాయితో రోడ్డుపై నిలిచి ఉన్న ఇద్దరు ఒడిస్సా వాసులను ఎస్ఐ అజయ్‌కుమార్ అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన యాసిన్ మల్లి, శామ్‌సన్‌పాల్ దొరవారిసత్రంలో మండల కార్యాలయ కూడలి వద్ద హైవేపై బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా.. వారిపై అనుమానంతో తనిఖీ చేశారు. వారి వద్ద 6.5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి నుండి సేకరించిన సమాచారం మేరకు కేరళ రాష్ట్రంలో ఓ హోటల్‌లో పనిచేసే వీరు గత కొంతకాలంగా ఒడిస్సా నుంచి కేరళకు తక్కువ మోతాదులో గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీఆర్ఈయూ విజయంతో రైల్వే ఉద్యోగుల సంబరాలు



సంబరాలు చేసుకొంటున్న రైల్వే ఉద్యోగులు

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ రైల్వే ఎంప్లాయూస్ యూనియన్ (డీఆర్ఈయూ) విజయం సాధించడంతో గురువారం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు సంబరాలు చేసుకొన్నారు. రైల్వేలో 11 సంవత్సరాలు తరువాత ఈ నెల 4, 5 తేదీల్లో సదరన్ రైల్వే చెన్నైకి సంబంధించి రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నిర్వహించారు. గురువారం 12న జరిగిన కౌంటింగ్‌లో సదరన్ రైల్వేలో గతంలో ఎన్నడూ లేని విధంగా డీఆర్ఈయూ 25,815 ఓట్లతో 40.33 శాతంతో మొదటి స్థానానికి చేరుకొని ఘన విజయం సాధించింది. దీంతో ఉద్యోగులు సంబరాలు చేసుకొన్నారు.